

# శ్రీ భగవద్గీతా మకరందం!



శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

**95**

## పదునేడవ అధ్యాయము - శ్రద్ధాత్రయ విభాగయోగము

**17. శ్రద్ధయా పరయా తప్తం తపస్తత్ త్రివిధం నరైః**
**అఫలాకాంక్షి భిర్యుక్తై స్సాత్త్వికం పరిచక్షతే**

**వ్యాఖ్య :** 'శ్రద్ధయా' అను పదమునకు 'పరయా' అను విశేషణమును చేర్చుట వలన సామాన్య శ్రద్ధ చాలదనియు, మిక్కుటమైన శ్రద్ధలే ఉత్తమమైన శ్రద్ధగా అవసరమని విదితమగుచున్నది. ఏలయనగా సాధకునకు మధ్యమధ్య ఏవైన అంతరాయములు గలిగినచో అల్పమగు శ్రద్ధచలించిపోవచ్చును. అందుచే అపరిమితమగు శ్రద్ధతో, విశ్వాసముతో, పట్టుదలతో గూడుకొనియున్నప్పుడు మాత్రమే మాయను దాటవీలగును

'నరైః'- ఇచట నరులు అని చెప్పబడినదే కాని జాతిమతకులాదు లెవ్వియు పేర్కొనబడలేదు. కావున మానవులందరనూ పరమార్థ లక్ష్యమును సాధించుటకు, భగవంతుని అన్వేషించుటకు, అర్హులేయని గీతాచార్యులు తెల్చిచెప్పివైచిరి.

'యుక్తైః'- భగవంతునితో ఆత్మతత్త్వముతో, పరమార్థసాధనతో కూడిక (యోగము), కలవారు, ప్రాపంచిక దృశ్యజాలముతో కూడిక తగ్గించుకొని, భగవద్ధ్యానపరులై యుండువారు, నిశ్చలచిత్తులు యుక్తులనబడుదురు.

దీనిని బట్టి సాత్త్విక తపస్సు నాచరించువారు మూడు సద్గుణములు గలిగియుండవలెనని తెలుచున్నది. అవి యేవియనిన - (1) వారు పరమశ్రద్ధతో గూడియుండవలెను (2) ఫలమును గోరక కర్మలను చేయవలెను (3) నిశ్చలచిత్తము, లేక భగవద్ధ్యానపరత్వము గలిగియుండవలెను - ఇట్టి ఉత్తమ స్వభావములు గలిగి పైన దెల్పిన త్రివిధ (వాచిక, వాచిక, మానసిక) తపస్సుల నాచరించుచో అది సాత్త్విక తపస్సనబడును.

**18. సత్కారమానపూజార్థం తపో దమ్భేన చైవయత్**
**క్రియతే తదిహ ప్రోక్తం రాజసం చలమధ్రువమ్**

**వ్యాఖ్య :** కొందరు తమ తపస్సును జూచి ఇతరులు తమ్ము సత్కరించెదరను భావముతో తపస్సు చేయనారంభింతురు. అది సదుద్దేశముతోను, హృదయ పూర్వకముగను స్థిరమైయుండదు. దాని ఫలితమున్ను అట్లే చపలముగా, అనిశ్చితముగా నుండును. కావున విజ్ఞులిద్దాని ననుసరించరాదు.

**19. మూఢ గ్రాహేణాత్మనో యత్పీడయా క్రియతే తపః**
**పరస్యోత్సాదనార్థం వా తత్తామసముదాహృతమ్**

**వ్యాఖ్య :** 'మూఢగ్రాహేణ' - (మూర్ఖపట్టుదలతో) పట్టుదల మంచిదే కాని అది వివేకముతో గూడినపుడే సత్ఫలములను నొసంగగలదు. మూర్ఖపు పట్టుదలల వలన ప్రయోజనము లేదు.

'ఆత్మనో యత్పీడయా'- కొందరు మూర్ఖపు పట్టుదలతో శుష్కోపవాసాదుల ద్వారా తమ శరీరమును బాధించుకొనుచు తపస్సు చేయుదురు. తపస్సుగాని, ఉపవాసముగాని, మంచివే అయినను కొంత వివేకమును వానికి జోడించినపుడే అవి శోభించును. లేకున్న మనుజుడు వక్రమార్గమున జను ప్రమాదము కలగదు. అట్టి వివేకములేని కారణము చేతనే కొందరు ఇతరులను నాశనమొనర్చుటకుగాను తపస్సు చేయుచుందురని ఇట చెప్పబడినది. ఈ ప్రకారముగ వారు తపస్సును సాధనమును దుర్వినియోగపరచుకొనుచున్నారు. దీనికంతటికిని మూఢత్వమే కారణము. కావున దానిని పోగొట్టుకొని రాజస, తామస తపస్సుల నాశ్రయింపక తమకున్న యీ పట్టుదలను సన్మార్గమున వినియోగించి, దైవప్రాప్తికై సాత్త్విక తపస్సునే ఆశ్రయించి తరించవలయును.

ఈ శ్లోకముగా ద్వారా ఈ క్రింది యంశములు తెలుచున్నవి.

1. మూర్ఖపు పట్టుదల పనికిరాదు 2. శుష్కోపవాదముల ద్వారా తన శరీరమును గాని, మనస్సునుగాని బాధించుకొనకూడదు. 3. పరప్రాణికి కీడుచేయరాదు

**20. దాతవ్యమితి యద్దానం దీయతే౽నుపకారిణే**
**దేశే కాలే చ పాత్రే చ తద్దానం సాత్త్వికం స్మృతమ్**

**వ్యాఖ్య :** 'దాతవ్యమితి' - ప్రతివాడును దానము చేయుట తన ధర్మమని తలంచి దానము చేయవలెను. అంతియే కాని ఒకరిమెప్పుకొఱకుగాని, ప్రతిఫలాపేక్షతోగాని చేయరాదు. 'నీవే దానము చేయుచున్నా'వని యెవరైన దాత నడిగినచో 'ఇది నా ధర్మము. నేను దానము చేయవలసినదే ('దాతవ్యమ్') కాబట్టి చేయుచున్నాను. అనియే సమాధానము చెప్పవలయును. వాస్తవముగ త్యాగము చేయుట, దానము చేయుట తన మేలు కొఱకే యగును. ఒకరికి ఉపకారము చేసినను అదియు (పుణ్యప్రాప్తివలన) తనకు తాను చేసికొను ఉపకారమే యగును. కావున దానము చేయువారు తామేదో ఒకరి నుద్ధరించితిమని తలంచుటకంటే ఆ దానక్రియచే తమ్ముతాము యుద్ధరించుకొననివారైరని భావించుట యుత్తమము.

'అనుపకారిణే'- అని చెప్పినందువలన, ప్రత్యుపకారము చేయలేనివారికి, బీదవారికి, అశక్తులకు, వికలాంగులకు, దరిద్రనారాయణులకు చేయు దానము ఉత్కృష్టమని తెలుచున్నది. మఱియు శక్తిగలవారికి, ప్రత్యుపకారము చేయగల సమర్థత గలవారికి దానము చేయుట అంత ఉత్తమమైనదిగాదనియు ఈ పదము ద్వారా సూచితమగుచున్నది.

'దేశే'- అనగా పుణ్యక్షేత్రమందు, తీర్థాదులందు, పవిత్ర ఆశ్రమాదులందు లేక పవిత్రమైనట్టి దైవగంధయుతమైనట్టి ఏ ప్రదేశమందైనను అని యర్థము. 'కాలే' యనగా గ్రహణము, సంక్రాంతి, లేక ఏదైన పుణ్యకార్య సందర్భము- ఇత్యాది రూపమగు పవిత్ర కామునందు అని యర్థము. 'పాత్రే' యనగా యోగ్యతగలవానికి, తగినవానికి అని యర్థము. పాత్రత నెఱింగి దానము చేయుదని పెద్దలు చెప్పుదురు. దానము చేసినచో దాతకు ఉత్తమఫలము చేకూరునని భావము

*(తరువాయి వచ్చే సంచికలో)*

**పాలక ప్రతిపక్షములు సమస్యల్ని పరిష్కరించుటకు కృషి చేయాలి! సమావేశములకు ప్రతిబంధకమగు వారిని శిక్షించు శాసనం ఉండాలి.**




# ఘంటసాలనే పద్యగీతంలో నటించని హీరో లేడు
# A.N.R., N.T.R. లిరువురికి నొప్పేట్లు పాడిన గాన కళా నిపుణుడు

**చెలియాకనరావా, చికిలింత చిగురూ సంపెంగ గుబురూ** – అంటూ

శృంగార, విషాద, క్రోధ, హాస్య రసాలన్నింటితోనూ ఆయన గాత్రం ఆడుకుంది. సుధామధురస కోమల గీతం పాడితే, ఎలాంటి మనసైనా కరుగుతుంది. కంఠం, గాన విద్య, భగవత్ప్రసాదితం అయితే, సాధన ఆ మహనీయుడిది.

'మైక్‌లో పాడడానికి నీ కంఠం పనికిరాదు' పొమ్మన్న హెచ్.ఎమ్.వి. గ్రామఫోన్ వాళ్లే– తర్వాత ఆయన చేత ఎన్నో పాటలు, పద్యాలు, భగవద్గీత శ్లోకాలు పాడించుకుని లక్షలు ఆర్జించారు.

సంగీతం నేర్చుకోవాలన్న తపన చిన్ననాడే ఆరంభమైంది. అప్పుడు ఆంధ్రదేశంలో ఎక్కడా సంగీత కళాశాలలు లేవు– ఒక్క విజయనగరంలోనే వుంది– మహారాజా వారి భిక్షతో, దారి, తెన్నూ తెలియకపోయినా, జేబులో దమ్మిడీ లేకపోయినా విజయనగరం సంగీత కళాశాలకి వెళితే, కళాశాలకు – సెలవులు. ఎవరి ద్వారానో పట్రాయని సీతారామశాస్త్రి గారిని కలుసుకుంటే ఆయన ఆశ్రయం ఇచ్చి సంగీతారంభం చేశారు.

అసలు వెంకటేశ్వరరావు గారికి గాత్రం నేర్చుకోవాలని లేదు. వయొలిన్ వాద్యం నేర్చుకోవాలని ఉంది, సుప్రసిద్ధ వయొలిన్ విద్వాంసుడు ద్వారం వెంకటస్వామి నాయుడు ఆ సంగీత కళాశాలకి అప్పుడు ప్రిన్సిపాల్. తన అభీష్టం ఆయనతో చెబితే, ఆయన "నీ కంఠం బాగుంది. పాట చాలా బాగా పాడుతున్నావు. గాత్రం అభ్యసించు" అని ఆశీర్వదించారు.

అలా ఘంటసాల సంగీత సాధన చేశారు. వెంకటేశ్వరరావు జోలెకట్టుకుని మాధూకరం ఎత్తుకుని – జీవితం గడిపారు.

తొలినుంచి వున్న వినయం– అలా చివరివరకూ కొనసాగింది. అందర్నీ 'బాబూ' 'నాయనా' అంటూ సుశ్రావ్య అభిమానం సంపాదించుకున్నారు.

'సంగీత విద్వాన్' అయ్యాక, మద్రాసు పయనమయ్యారు. తన యింటిపేరుగల బలరామయ్యగారి ఆఫీసుకి వెళ్లాడు. ఈ ఘంటసాలకీ, ఆ ఘంటసాలకీ బంధు సంబంధం ఏమీ లేకపోయినా, వినయవిధేయతలతో వున్నాడని బలరామయ్యగారు ఆఫీసులో పెట్టుకున్నాడు.

అప్పుడే 'సీతారామజననం' (1944) ఆరంభమవుతోంది. అక్కినేని నాగేశ్వరరావు తొలి సినిమా. ఆయనతోపాటు ఒకే గదిలో వుంటూ కాలక్షేపం చేశారు. ఆ సినిమాలోని కోరస్ పాటల్లో ఘంటసాల కంఠం వుంది. 'గుంపులో గోవింద'లా చాలా చోట్ల ఆయన మూర్తి పాల్గొంది.

ఆ సినిమా సంగీత దర్శకుడు ఓగిరాల రామచంద్రరావు ఆయన దగ్గర, కాస్త దూరంగా కూచుని "పాట ఎలా స్వరపరుస్తారు? ఆర్కెస్ట్రాకి ఎలా చెబుతారు? అని గ్రహిస్తూ ఘంటసాల– తనకు తెలిసిన సముద్రాల రాఘవాచార్య ద్వారా బి.ఎన్. రెడ్డినీ, చిత్తూరు నాగయ్యనీ కలిసి–పాడి వినిపిస్తే తొలి అవకాశం యిచ్చారు.

'స్వర్గసీమ' (1946)లో భానుమతితో కలిసి పాడే అవకాశం కలిగింది. సి.హెచ్. నారాయణరావుకి 'గాజుల పిల్ల' నాటకంలో ఘంటసాల తొలి గాత్రం వినిపించింది. నిరంతరం గాత్ర సాధన సల్పుతూ, నాగయ్యగారి దగ్గర 'త్యాగయ్య'కీ, గాలిపెంచెల నరసింహారావు దగ్గర 'పల్నాటియుద్ధం' సినిమా సహాయకుల్లో ఒకడిగా అవకాశం సంపాదించారు.

'పల్నాటియుద్ధం'లో నేపథ్యగీతం, గోవిందరాజు సుబ్బారావుకి పాట పాడారు. బృందగానాల్లోనూ పాడారు. విడిగా ఇచ్చిన గ్రామఫోన్ రికార్డుల్లోని పద్యాలు కొత్త విధానంగా, భావయుక్తంగా, హాయిగా వినిపించడంతో సంగీతాభిమానులు ఘంటసాల వెంకటేశ్వరరావు 'నామస్మరణ' మొదలు పెట్టారు. బాలరాజు, ధర్మాంగద, లైలామజ్నూ' చిత్రాలలో 'ఘంటసాల' పేరు మార్మోగిపోయింది. చిత్రాలకు సంగీతం కూర్చాలన్న ఆసక్తి 'మనదేశం', 'కీలుగుర్రం' చిత్రాలలో నెరవేరింది.

పద్యానికీ, పాటకీ, ఘంటసాలే కావాలన్న స్థాయి లభించింది, అన్ని రకాల, రసాల పాటలూ పాడుతూ, చక్కని హాయి గొలిపే సంగీతం చేస్తూ ఇంటింటా వంట ఇంటా – ఘంటసాల తన కంఠం వినిపించారు. మూడువేల పైచిలుకు పాటలు పాడినా, అదే తొలినాటి వినయం! విధేయం! గర్వం లేదు.

'పాటంటే నేనే పాడాలి' అన్న అహంకారమూ లేదు. ఏ పాట పాడినా, దానికి ప్రాణం పోయాలన్న తపన మాత్రమే ఉండేది! ఏపాటని స్వరపరచినా నాలుగు కాలాల పాటు నిలవాలన్న తపస్సు! ఘంటసాల సంగీతం చేసిన చాలా చిత్రాలు. ఆర్థికంగా విజయం పొందాయ్. నేటికీ ఆ పాటలు వినిపిస్తూనే ఉన్నాయి.

భగవద్గీత, కుంతీకుమారి, పుష్పవిలాపం, దేశభక్తిగీతాలు, పద్యాల ప్రైవేట్ రికార్డులు వినిపించని రోజులేదు.

1945 నుంచి 30 సంవత్సరాలపాటు ఖంగుమన్న కంఠబలం తగ్గుతోందని, ఏవేవో నాటు మందులు వేసుకోవడంతో గాత్ర నియంత్రణం అసాధ్యమైంది. ఆరోగ్యం కూడా మందగిస్తున్నది. విజయహాస్పిటల్‌లో చేరి చికిత్స పొందుతున్నారు. పాడిపాడి ఉన్న కంఠం ఇంకా పాడాలని ఉరకలు వేస్తున్నా ఆరోగ్యం సహకరిచండం లేదు. విజయ హాస్పిటల్‌కీ వాహినికి మధ్యదూరం కొన్ని గజాలు. రెండింటికీ మధ్య దారి వుంది. ఆ దార్లో ఆయన సాయంవేళల్లో స్టూడియోకి వచ్చి బెంచీమీద కూచునేవారు. 'ఎంతసేపు ఉంటాం బాబూ! ఇక్కడ ఈ స్టూడియో గాలి కాస్సేపు పీలిస్తే– ఆనందంగా వుంటుంది" అనే వారు.

పొంచివున్న మృత్యువు ముంచుకొచ్చింది. 1974 ఫిబ్రవరి 11వ తేదీన– ఆయన్ని ఎత్తుకుని ఏ గంధర్వ లోకం నుంచి భువికి వచ్చాడో, ఆ లోకానికి తీసుకుపోయింది. సంగీతం విషాదమైపోయింది.

ఆయనతో పనిచేసిన ఆర్కెస్ట్రా వారు రాత్రింబవళ్లు భౌతిక దేహం దగ్గర కూచుని భక్తిగీతాలు పలికించారు. పాడారు.

తమిళ, తెలుగు చిత్ర పరిశ్రమల నుంచి ఎందరెందరో వచ్చి, ఆ మహనీయుడికి నివాళులు అర్పించారు. తాము అభినయించిన పాటకి ఆయన గాత్రం వల్ల పేరు తెచ్చుకున్న ఇద్దరు ప్రసిద్ధ నాయకులూ, అంతిమ సమయంలో వస్తారని ఎదురు చూశారు. రాలేదు. ఒకరు హృదయ చికిత్స జరిగి విశ్రాంతిలో వున్నారు. ఒకరు విజయవాడలో షూటింగ్‌లో వున్నారంటూ రాలేదు.

భోరుమని కురుస్తున్న వానలో ఘంటసాల అంతిమయాత్ర సాగింది. 'అమరజీవి ఘంటసాలకీ – జై' అన్న నినాదాలు, వానహోరుతో పోటీపడ్డాయి. అసంఖ్యాక అభిమానులు ఆ యాత్రలో పాల్గొని– వీధి మొత్తం ఖాళీ లేకుండా చేశారు.

'చివరిరోజు వరకూ తాను పాడుతూనే వుండాలన్న ఆయన కోరిక నెరవేరలేదు. లేకపోతేనేం– ఆయన పాటలు వినిపించని రోజు వుందా? ఆయన విగ్రహంలేని ఊరుందా? ఆయన పుట్టిన రోజుని, చివరిరోజునీ స్మరించుకుంటూ, ఆయన పాటలు పాడని సంగీత సభలున్నాయా?

ఆచార్య ఆత్రేయ చెప్పినట్లు 'ఈ ప్రపంచంలో శబ్దం వున్నంతవరకూ – ఘంటసాల కంఠం వినిపిస్తూనే వుంటుంది అన్నది అక్షరసత్యం.

**(రావికొండలరావుకు కృతజ్ఞతలు)**

# త్యాగరాజు భక్తి సామ్రాజ్యం

నేను తిరువాయూరులోని త్యాగరాజుల వాసాన్ని చూసాను. తంజావూరులో వారి బంధువుల యింట త్యాగరాజుల వారు ఆరాధించిన శ్రీరామపరివార విగ్రహాలను చూసి ధన్యుడనయ్యాను. అక్కడ త్యాగరాజ ఆలయంలో సత్కారం పొందడం అదృష్టంగా భావిస్తున్నాను. – 'గోటేటి'

ప్రపంచ సంగీత సాహిత్య చరిత్రలో 18వ శతాబ్దం ఒక విశిష్టతను సంతరించుకుంది. త్యాగయ్య జననంతో కర్ణాటక సంగీతం మరిన్ని సొగసులను అమర్చుకుంది. భారతీయ సంగీతపు టెల్లలు మరింత విస్తృతమైనాయి. క్రీ॥శ॥ 1767 వ సం॥ మే నెల 4 వ తేదీన తిరువాయూరులో త్యాగరాజు జన్మించి 1847 జనవరి 6 వ తేదీన తిరువయ్యూరులోనే పరబ్రహ్మలో లీనమయ్యారు. త్యాగరాజ భక్తి సామ్రాజ్యం అఖిల భారతదేశంలో సుస్థాపితమైంది.

తంజావూరుకు 60 మైళ్ల దూరంలో ఉన్న ప్రతిష్ఠాత్మక శైవక్షేత్రం తిరువాయూరు సంగీత త్రిమూర్తులు ముగ్గురూ ఈ ఊరిలోనే జన్మించారు. తాగ్యరాజులవారు జన్మించిన గృహం తిరువాయూరులో కొత్తవీధి, 6వ నెంబరు గృహంలో ఉన్నది. విశాలమైన ఈ గృహంలో త్యాగరాజ జన్మించిన గదిని త్యాగరాజు చిత్రపటాలలో ప్రజల సందర్శనార్థం ఏర్పాటు చేశారు. త్యాగరాజు జన్మించిన గదిలోని ఇత్తడి విగ్రహం చూపరులను విశేషంగా ఆకర్షిస్తుంటుంది. కంచికామకోటి పీఠం వారి ఆధ్వర్యంలో ఇక్కడ నిత్య దీపారాధన జరుగుతుంది. నిత్యం అనేకమంది సందర్శకులు ఈ ఇంటిని దర్శించి త్యాగరాజకీర్తనలను గానం చేస్తూ ఆ పుణ్యపురుషునికి అంజలి ఘటిస్తూంటారు.

త్యాగయ్య తల్లి సీతమ్మ, తండ్రి రామబ్రహ్మం. ఆర్థిక ఇబ్బందుల వలన తంజావూరుకు 10 మైళ్ల దూరంలో ఉన్న తిరువయ్యూరుకు తన నివాసాన్ని మార్చారు. అప్పటి తంజావూరు పాలకుడైన తులజీ మహారాజు రామబ్రహ్మానికి తిరువాయ్యూరులోని కావేరి నదీ తీరంలో ఉన్న తిరుమంజనం వీధిలో ఒక గృహాన్ని, కొంతభూమిని గౌరవపురస్కారంగా ఇచ్చినట్లు చారిత్రకాధారాలున్నాయి. తిరువయ్యూరులో ప్రఖ్యాతి చెందిన పంచనదీశ్వర స్వామి దేవాలయాన్ని, అమ్మవారు ధర్మాంబికను త్యాగరాజు నిత్యం సేవించి, అనేక కీర్తనలను గానం చేసారు. త్యాగరాజు నిత్యం స్నానం చేసిన కావేరీ నది ఘట్టాన్ని ఇక్కడి చూడవచ్చు. ప్రస్తుతం తిరుమంజనం వీధిలోని త్యాగరాజు గృహంలో అతని వాటాగా ఇచ్చిన ఉత్తర భాగాన 'సద్గురు త్యాగబ్రహ్మం ట్రస్టు అనే సంస్థ ఉన్నది.

త్యాగరాజు అన్న జపేశానికి చెందిన దక్షిణంవైపు ఇంటి భాగం అనేక పర్యాయాలు క్రయ విక్రయాలకు లోనైందని తెలుస్తోంది. త్యాగరాజు నివసించిన ఉత్తరం వైపు భాగం మాత్రం ఏ మార్పులు, చేర్పులు లేకుండా ఉంది. త్యాగరాజు ఆస్తిగా పొందిన శ్రీరామ పంచాయతన విగ్రహాలు వుంచి పూజించిన 'పూజాగూడు' త్యాగరాజు భక్తికి సాక్షీభూతంగా దర్శనమిస్తుంది. పూజాగృహం వెనుక భాగంలో వంట ఇల్లు, ఆ వెనుక పెద్ద నుయ్యి ఉన్నాయి. త్యాగరాజు గానాన్ని రహస్యంగా విని ఆనందించిన తంజావూరు మహారాజులు సంగీతాభిలాషకు నిదర్శనంగా ఇటుకలతో నిర్మించిన ఎత్తయిన ప్రహరీగోడ కనిపిస్తుంది. అన్నగారి అభీష్టం మేరకు ఇంటిని రెండు భాగాలు చేస్తూ నిర్మించిన గోడ యధాపూర్వకంగా చూపరులకు కనిపిస్తుంది.

**'పంచశర జనక ప్రపంచమున గల సుఖము**
**మంచువలెననుచు మదినెంచితిని గాని**
**పంచుకొని ధనము లార్జించుకొని సరియెవ్వ**
**రంచు మరి గతము లేదంచు బతికితినా"**

అంటూ ఆస్తిపాస్తుల మీద ఆశలేదని, శ్రీరాముని సద్భక్తియే పెన్నిధి యనీ భావించిన త్యాగరాజు శ్రీరాముని అంకిత భక్తుడు. తండ్రి ఎనిమిదవ సంవత్సరంలో




త్యాగరాజుకు ఉపనయనం కావించి తారక మంత్రోపదేశం కావించేడు. మరుదానల్లూరు మఠసన్యాసి శ్రీరమాకృష్ణానందస్వామి తాగ్యరాజుకు శ్రీరామ షడాక్షరీ మంత్రోపదేశం చేసేరు. నిత్యము పంచనదీశ్వరి స్వామి దేవళంలో నియమం తప్పకుండా లక్ష ఇరువది యైదు వేల సార్లు రామ మంత్రాన్ని త్యాగరాజు జపించి శ్రీరామదర్శన భాగ్యం పొందినట్లు చెబుతారు. శ్రీరామ దర్శనం పొందినవెంటనే అఠాణా రాగంలో 'బాలకనకమయ చేల సుజన పరిపాల' అంటూ గానం చేసి కీర్తించారు. 'తెరతీయగరాదా– నాలోని మత్సరమనే తెరతీయగ రాదా అనే సంకీర్తనంతో తిరుమల శ్రీవారిని దర్శించారు. త్యాగరాజ కృతి లేకుండా సంగీత సభ రక్తి కట్టదు. ●

*We Provide your comfortable Stay and Tasty Food Hospitality*

Bhimas Deluxe Hotel

**(PROPRIETORS BHIMAS HOTELS LIMITED)**

**34-38, G.Car Street (Near Railway Station),**
**TIRUPATI - 517 501 (A.P.)**
**Phone : 0877-2225521, 6669199, Fax : 2225471**
**Website : www.bhimasdeluxehotels.com**
**E-mail : bhimasdeluxe@rediffmail.com**




# త్రిమతాధిష్టానమూర్తులు

## శృంగేరిలో సమావేశం కావడం శుభదాయకం

పెజావర్‌స్వామి (ఉడిపిపీఠం), శ్రీశ్రీ సుబుధేంద్రతీర్థులు (మంత్రాలయా ధీశులు), శృంగేరి జగద్గురు మహాస్వాములు శ్రీశ్రీశ్రీ భారతీ తీర్థమహాస్వామివారు, శ్రీశ్రీశ్రీ త్రిదండి చినజియర్ రామానుజ స్వామివారు

ఈ నల్వురూ ఉద్దండ పండితులు, పీఠాధీశులు జనంలో సనాతనోద్ధారణ కోసం అహరహమూ కృషిచేస్తున్నారు. వేదానుష్టానపరులను ప్రోత్సహిస్తున్నారు. వారివారి బాటల్లో పయనిస్తున్న అపరవ్యాసులు, స్వపరభేదం లేకుండా సమావేశమయ్యారు. వీరందరూ క్రింది తరగతి ప్రజల్ని చైతన్యపరుస్తూండాలి. వారికోసం సత్రసావిడి మందిరాలను నిర్మించాలి. మతమార్పిడులు జరుగకుండా చూడాలి. సనాతన ధర్మం విలువల్ని వారికి తెలియచెయ్యాలి. వారిని అక్షరాస్యుల్ని చేయాలి. ముఖ్యంగా క్రైస్తవమిషనరీల ఆట కట్టించాలి.

# భారతదేశం జనసముద్రంగా మారుతూంది! ఆడపిల్లల సంఖ్య తగ్గిపోతూంది!



దేశమంటే మట్టికాదోయ్ దేశమంటే మనుషులోయ్.. గురజాడ మాటలు అక్షరసత్యమవుతున్నాయి. మన భారతావని జన సంపదతో అలరారుతోంది. దేశజనాభా 121 కోట్లకు చేరింది. ఇది అమెరికా ఇండోనేషియా, బ్రెజిల్, పాకిస్థాన్, బంగ్లాదేశ్, జపాన్ దేశాల మొత్తం జనాభాతో సమానం. గత పదేళ్లల్లో దేశజనాభా 18.1 కోట్లు పెరిగింది. దేశంలో జనాభా వృద్ధిరేటు మాత్రం తగ్గింది. 1911-1921 దశాబ్దాన్ని మినహాయిస్తే వృద్ధిరేటు తగ్గటం దేశంలో ఇదే మొదటి సారి. 2001లో ఈ రేటు 21.15 శాతం ఉండగా, 2011 నాటికి 17.64 శాతంగా నమోదైంది.

రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో అత్యధిక జనాభా కలిగినదిగా ఉత్తరప్రదేశ్ నిలిచింది. ఈ రాష్ట్రంలో 19.9 కోట్ల మంది ఉన్నారు. అత్యంత తక్కువ జనాభా ఉన్న కేంద్రపాలిత ప్రాంతంగా లక్షద్వీప్ ఉంది. ఇక్కడ జనాభా కేవలం 64,429. ఉత్తర ప్రదేశ్, మహారాష్ట్రల జనాభాలను కలుపుకుంటే అమెరికా జనాభా కంటే ఎక్కువ. ఉత్తర ప్రదేశ్ తరువాత మహారాష్ట్ర (11.22 కోట్లు) బీహార్ (10.33 కోట్లు), పశ్చిమబెంగాల్ (9.13 కోట్లు), ఆంధ్రప్రదేశ్ (8.46 కోట్లు) నిలిచాయి. ఢిల్లీలోని ఈశాన్య జిల్లాలు అత్యధిక జనసాంద్రత ఉంది. ఇక్కడ చదరపు కిలో మీటరుకు 37,346 మంది ఉంటే, అరుణాచల ప్రదేశ్‌లో దిచాంగ్ లోయలో చ.కి.మీ. ఒక్కరే ఉన్నారు.

**అక్షరాస్యత శాతం**


పురుషులు అక్షరాస్యత 82.14 శాతం ఉంటే మహిళలు 65.4 శాతం ఉంది. 93.91 శాతం అక్షరాస్యతలో కేరళ ముందంజలో ఉంది. తర్వాత లక్షదీవులు (92.88) ఉంది. 63.82 శాతం అక్షరాస్యతలో బీహార్ చివరిస్థానంలో ఉంది. మిజోరాంలోని సెర్చిప్ (98.78 శాతం), ఐజ్వాల్ (98.05 శాతం) జిల్లాలో అత్యధిక అక్షరాస్యత నమోదైంది.

**ఆంధ్రప్రదేశ్ జనాభా**

ఆంధ్రప్రదేశ్ జనాభా 8,46,65,533 కాగా, స్త్రీ పురుష నిష్పత్తి 992, అక్షరాస్యతం 67.66%, అత్యధిక జనాభా గల జిల్లా రంగారెడ్డి (52,96,396), అత్యల్ప జనాభా జిల్లా విజయనగరం (23,42,863), అత్యధిక జనసాంద్రత జిల్లా హైదరాబాద్ (18,480), అత్యల్ప జనసాంద్రత జిల్లా ఆదిలాబాద్ (170) జిల్లాలు ఉంటున్నాయి. 2001-11 దశాబ్దిరేటు 11.10, రాష్ట్రంలో స్త్రీల అక్షరాస్యత 59.74%, పురుషుల అక్షరాస్యత 75.56గా ఉంటూంది. ఆడపిల్లల విషయంలో మాత్రం యువత జాతి తలదించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఆడపిల్లల సంఖ్య ఎన్నడూ లేనంతగా పడిపోయింది. మన రాష్ట్రంతో సహా దేశవ్యాప్తంగా ఇదే పరిస్థితి.

ఆడపిల్లలను కడుపులోనే కడతేర్చే దురాచారం దేశవ్యాప్తంగా యధేచ్ఛగా నడుస్తుంది. ఆడపిల్లల పట్ల పాతుకుపోయిన వివక్షను పెకలించి వేయటానికి, ఎన్ని ప్రయత్నాలు చేసినా... అవేమీ ప్రజల మనసుల్ని.. సమాజ ధోరణులను మార్చలేకపోతున్నాయి. నాటికంటే ఆడపిల్లల సంఖ్య మరింత దిగజారినట్లు స్పష్టమైంది. ఇది అత్యంత ఆందోళనకర పరిణామం. దక్షిణాది రాష్ట్రాల్లో ఆడపిల్లల జాతీయ సగటు కన్నా ఎక్కువగా ఉన్నా 2001 గణాంకంతో పోలిస్తే ఈ రాష్ట్రాల్లోనూ పరిస్థితి దిగజారింది.

ఆరేళ్లలోపు ఆడపిల్లల సంఖ్య అన్ని చోట్ల తగ్గిపోతుంటే... ఆడపిల్లలను గర్భంలోనే చిదిమివేసే అవాంఛనీయ ధోరణి దేశవ్యాప్తంగా, విశృంఖలంగా కొనసాగుతుందనే విశ్లేషకులు అంటున్నారు. కుటుంబాలు సంపన్నవంతమవుతున్నకొద్దీ, ఆడపిల్లల పట్ల వివక్షాత్మక ధోరణి విపరీతంగా అధికం కావటం ఆందోళనకరంగా ఉన్నది. గర్భస్థ శిశువు నిర్ధారణ పరీక్షలను నిషేధిస్తూ 1996 లోనే చట్టం తెచ్చినా, భ్రూణ హత్యలు, శిశుహత్య లకు వ్యతిరేకంగా 'సేవ్ గర్ల్‌చైల్డ్' వంటి చైతన్య కార్య క్రమాలు ఎన్ని చేపట్టినా.. ఫలితాలు కనిపించడం లేదు. మన రాష్ట్రంలోనూ ఆడపిల్లల విషయంలో వివక్షత కొనసాగుతోంది. 2001 జనగణ నలో ప్రతి వెయ్యి మంది మగపిల్లలకు 961 మంది ఆడపిల్లలు ఉండగా, ఈ పదేళ్ళలోనూ పరిస్థితి ఇంకా దిగజారింది. ●



# తండ్రి వంటి సౌమ్యుడు తమ్మారెడ్డి భరద్వాజ

**తమ్మారెడ్డి భరద్వాజ తండ్రి కృష్ణమూర్తి వంటి సౌమ్యుడు. తండ్రి వలెనే భేషజం లేనివారు. తండ్రి కృష్ణమూర్తిలానే కొద్ది చిత్రాలు నిర్మించి, మంచి తనాన్నెక్కువగా పెంచుకున్నవాడు. అందర్నీ కూడగట్టుకునే స్వభావం కలవాడు.**

**ఆ మధ్య ఒక పత్రికలో అతడు ముచ్చటించిన 'కారు ప్రయాణం' సారాంశం ఈ వ్యాసం:**

రైల్లో ప్రయాణం అంటే నాకు అలర్జీ. ఎక్కడలేని నిరుత్సాహం ముంచుకొస్తుంది, సాధ్యమైనంతవరకు దాన్నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నిస్తాను. రైల్వేస్టేషన్లలోని అపరిశుభ్రమైన వాతావరణం, రైలులో వచ్చే ఒక రకమైన వాసన.. నాకు పడవు. పైగా నాకు డస్ట్ అలర్జీ ఉంది. రైలు ప్రయాణం చేస్తే చాలు అనారోగ్యానికి గురవుతా. అందుకే చిన్నప్పటి నుంచి నేను రోడ్డు ప్రయాణాలపైననే మక్కువ పెంచుకున్నాను. కారులో కూర్చుని విండోస్ వేసుకుంటే ఏ గొడవా ఉండదు. కాలేజీలో చదువుకుంటున్నప్పుడు కూడా కారులో వెళ్తున్నామంటేనే నేను బయలుదేరేవాణ్ణి.

### ఒకే కారులో 12 మంది

ఉస్మానియా యూనివర్శిటీలో ఇంజనీరింగ్ చదువుతుండగా (1971) మా మిత్రుడు గోవర్ధన్ రెడ్డి (సినారె బంధువు) పెళ్లి కోసం కరీంనగర్‌కు వెళ్లాల్సి వచ్చింది. నాకు అంతగా గుర్తులేదు కానీ బహుశా అది సినారె గారి ఊరో (హనుమాజీపేట) దాని పక్కనున్న ఊరో అనుకుంటా. యూనివర్శిటీ మిత్రులు బస్సులో వెళ్దామని ప్లాన్ చేస్తుండగా చివరి నిమిషంలో సంజీవరెడ్డి అనే మిత్రుడు కారులో వెడదామనేసరికి నేను కూడా రెడీ అయ్యాను. సుమారు 10 మంది రోడ్డుమీద ఎదురు చూస్తుంటే మావాడు ఒక అంబాసిడర్ కారులో దిగాడు. 'ఇంతమందికి కనీసం రెండు కార్లన్నా కావాలి కదా' అన్నాం. 'డబ్బులెవడిస్తాడు.. ఒక్క కారు చాల్లే' అంటూ మా అందరినీ అందులో కుక్కాడు. అంటే డ్రైవర్‌తో కలిపి 12 మందిమి. ఒకరికాళ్ల మీద మరొకరు కూర్చుని, మార్గమధ్యలో దిగుతూ, ఎక్కుతూ, సుమారు ఆరేడు గంటలు ప్రయాణించి, ఎలాగైతేనేం కరీంనగర్ చేరుకున్నాం. అక్కడ్నించి పెళ్లికొడుకు ఊరి పొలిమేరల దాకా వెళ్లిన తర్వాత సన్నటి మట్టి రోడ్డు మాత్రమే కనిపించింది. ఆ దారివెంట కారు ముందుకు వెళ్లడం కుదరదని డ్రైవర్ అక్కడే ఒకచెట్టు కింద కారాపేశాడు.

అప్పటికే అష్టకష్టాలు పడి వచ్చిన మేము ఊళ్లోకి వెళ్లాలంటే ఇంకో మూడు కిలోమీటర్లు నడవాలి అన్నారు. చేసేది లేక ఎర్రటి ఎండలో నడక ప్రారంభించాం. దారిపొడవునా పౌడర్‌లాటి దుమ్ము. అడుగు తీసి అడుగు వేస్తుంటే కాలు ఆ దుమ్ములో ఐదారు అంగుళాలు లోపలికి వెళ్తోంది. మరోవైపు వేగంగా వీస్తున్న గాలికి దుమ్ము రేగుతోంది. పెళ్లికి వెళ్తున్నామని టిప్‌టాప్‌గా తయారైన మేము పెళ్లి మంటపానికి చేరుకునేసరికి దుమ్ము పట్టి గుర్తుపట్ట లేకుండా మారిపోయాం. అప్పట్లో అందరం సన్నగా ఉన్నాం కాబట్టి సరిపోయింది. కానీ ఒక్క కారులో 12 మందిమి ఎలా వెళ్లామా? అని ఆలోచిస్తే ఇప్పటికీ వింతగానే అనిపిస్తుంది. కాలేజీ రోజుల్లో ఫ్రెండ్స్ పెళ్లిళ్ల కోసం లారీలు ఎక్కి ట్రాక్టర్లు ఎక్కి, చేసిన అలాంటి సాహసాలు, అనుభవాలు చాలానే ఉన్నాయి.

### ఆకలిని చంపుకుంటూ చేసిన అమెరికా ప్రయాణం


మా పెద్దమ్మాయి చరిత పెళ్లి చేసుకుని న్యూజెర్సీలో సెటిలయ్యింది. ఆమెను చూసేందుకు 2000వ సంవత్సరంలో నేను ఒంటరిగా (చెప్పానుగా భార్యతో నేను ప్రయాణాలు చేసింది చాలా తక్కువ) అక్కడికి బయలుదేరాను. అంతకు ముందు మలేషియా వంటి దేశాలకు వెళ్లిన అనుభవం ఉన్నప్పటికీ అమెరికా వెళ్లడం అదే మొదటిసారి. నాకు టికెట్ బుక్ చేసిన వారు కొరియన్ ఎయిర్‌లైన్స్‌లో టికెట్ బుక్ చేయడమే కాకుండా మెనూలో నాన్‌వెజిటేరియన్ దగ్గర టిక్ చేశారు. ఇప్పటిలాగా అప్పట్లో ఫ్లయిట్లలో ఏదిపడితే అది దొరికేది కాదు. పైగా అమెరికా వెళ్లే కొరియన్ ఫ్లయిట్‌లలో ఏ ఆహారపదార్థమైన బీఫ్, కప్పలు, పాములవంటి వాటితోనే చేస్తారని నాకు రాంగ్ ఫీడ్ చేసి ఉండటం వల్ల వాటిని ముట్టకూడదను కున్నాను. 30 గంటల ప్రయాణంలో ఆకలిని చంపుకుని కేవలం బిస్కెట్లు తింటూ, మంచినీళ్లు తాగుతూ ప్రయాణించాను.

### ఎయిర్‌పోర్టులో డబ్బుల్లేక... మరోసారి

"అంతఃపురం' సినిమా షూటింగ్ కోసం మారిషస్‌కు వెళ్లాం. అక్కడున్న షెడ్యూలు కన్నా ముందే షూటింగ్ పూర్తి అయిపోవడంతో అసిస్టెంట్ డైరెక్టర్లు, టెక్నీషియన్లకు తలా కొన్ని డాలర్లు ఇచ్చి షాపింగ్ చేసుకోమన్నాను. నా దగ్గర మిగిలిన డాలర్లను కూడా కృష్ణవంశీ పట్టుకుపోయాడు. ఎయిర్‌పోర్టుకు వెళ్లి అక్కడి నుంచి డైరెక్ట్ ముంబాయికి వెళ్ళడమే కదా, డాలర్లతో ఏం పని అనుకుని నేను కూడా లైట్‌గా తీసుకున్నాను. ఎయిర్‌పోర్టుకు చేరుకునేసరికి ఆకలి దంచేస్తోంది. జేబులో నయాపైసా లేదు. అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న శ్రీవాస్‌కు వాకబు చేస్తే షాపింగ్ చేయగా చివరికి తన దగ్గర 5 డాలర్లు మాత్రమే మిగిలాయన్నాడు. వాటితో ఏం తినాలో తెలియలేదు. ఎయిర్‌పోర్టు అంతా తిరుగుతూ అక్కడి తిండి పదార్థాలపై రేట్లు చూసాం. ఒకచోట మూడు డాలర్లకు రెండు శాండ్‌విచ్‌లు దొరికితే, వాటిని కొనుక్కుని తిని, నీళ్లతో కడుపునింపుకున్నాను. నిర్మాతగా అందరికీ డబ్బులిచ్చి షాపింగ్ చేయమన్న నాకే, దేశం కాని దేశంలో, నీళ్లతో కడుపునింపుకోవాల్సిన అనుభవం మళ్లీ అనుభవానికి వచ్చింది.

# కృష్ణాపత్రిక ప్రారంభించిన దేశభక్త కొండావెంకటప్పయ్య 'దేశభక్త' అన్న బిరుదమును ప్రజలే యిచ్చారు!

దేశ స్వాతంత్ర్య పోరాట సమయంలో తెలుగు ప్రజలను ఉత్తేజపరిచిన పత్రిక కృష్ణా పత్రిక. మచిలీపట్నం నుండి కృష్ణాపత్రికను ప్రచురించిన ఆ పత్రిక వ్యవస్థాపకుడు, సంపాదకుడు ముట్నూరు అన్నంతగా ప్రజలలో ముద్రపడినా; నిజానికి ఆ రెండు బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించిన వ్యవస్థాపక వ్యక్తి శక్తి కొండావెంకటప్పయ్య గారిది. తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం కోసం తన న్యాయవాద వృత్తిని వదులుకుని రంగంలోకి దిగిన తొలివ్యక్తి కొండావారే. పూర్తికాలం తెలుగుజాతి కోసం జీవితాన్ని అంకితం కావించి, బాపట్లలో తొలి ఆంధ్రమహాసభ నిర్వహించబడింది, ఆ ఉద్యమం భాషాప్రయుక్త రాష్ట్రాల ఆలోచనను కలుగజేసింది. ఆ ఖ్యాతి ఆంధ్రులదే! తర్వాత ఒరియా, సింధి, మరాఠా భాషలవారు తమకు ప్రత్యేక రాష్ట్రాలు కావాలన్నారు. కానీ 1953 వరకు తెలుగు రాష్ట్రం ఏర్పడకుండా పోయింది. బ్రిటీష్‌వారికి సహకరించిన ఒరియా, సింధీలకు రాష్ట్రాలు ఏర్పడ్డాయి. తెలుగువారి త్యాగశీలాన్ని గాంధీజీ గుర్తించి ఆంధ్ర కాంగ్రెస్ కమిటీని ఏర్పాటు చేసినప్పుడు కొండావెంకటప్పయ్యనే అధ్యక్షులుగా నియమించారు. ప్రకాశం పంతులు, భోగరాజు పట్టాభిసీతారామయ్య వంటి నాయకులు ఆయన మార్గంలో పనిచేశారు. ఆయన అనుచరులు అనేకమంది రాజకీయాలలో పలు రకాల పదవులు పొందినా ఆయన మాత్రం ఎటువంటి పదవీకాంక్ష చూపలేదు. ప్రజాసేవ అంటే ప్రజాసేవలోనే జీవితం గడిపారు. ఆయన మద్రాస్ శాసనమండలిలో సభ్యుడైనపుడు గ్రంథాలయాలకు ప్రభుత్వ గ్రాంట్ ఏర్పాటు చేయించారు. జాతీయ స్థాయిలో లైబ్రరీ గ్రాంట్ అనే గ్రాంటు వెంకటప్పయ్య ద్వారానే మొదలయింది.



గుంటూరులోని ఆయన నివాసభవనానికి స్వాతంత్ర్య సమర జాతీయ నాయకులయిన మహాత్మాగాంధీ, నెహ్రూ, పటేల్, అనీబిసెంట్ వంటి అగ్రనాయకులంతా వచ్చారు. ఆయన కుటుంబం, ఆ భవనాన్ని నవోదయ విద్యాలయానికి విరాళంగా ఇచ్చేసారు. ప్రజలు ఆయనకు ఇచ్చిన బిరుదు 'దేశభక్త'.

ఆయన పుట్టింది రైతుకుటుంబం కాకపోయినా రైతాంగ సమస్యల మీద స్పందించేవారు. ఎన్.జి.రంగా ఆధ్వర్యంలో రైతు ఉద్యమం ప్రారంభమై రైతాంగ శిక్షణా సంస్థ ఆరంభించినప్పుడు తొలి అధ్యక్షస్థానం ఆయనకే యిచ్చారు. ఆచార్యరంగా తన పుస్తకాలను కొండావారికే అంకితం చేసి తన గౌరవాన్ని తెలియచేసుకున్నారు.

**ఎవరిభాషలో వారికి విద్య నేర్పాలి, విషయాలు అందరికీ అందించాలి. అప్పుడే భాషా జాతులు ఎదుగుతాయి. జాతీయాభివృద్ధిలో పాలుపంచుకుంటాయి అని ఆయన దాదాపు వందేళ్లక్రితమే చెప్పారు. ఐరోపా దేశాల ఎదుగుదల వారి మాతృభాషలో విద్యాబోధనే కారణమైందన్నారు. తెలుగువారి కోసం ప్రత్యేకంగా తెలుగు రాజకీయ సాహిత్యం రాసి పంచటం మొదలుపెట్టారు. అందుకోసమే వారు కృష్ణాపత్రికను ప్రారంభించారు.**


స్వాతంత్ర్యం సిద్ధించేసరికే ఆయన వయసుమీదపడింది. 1920లో తాను ప్రతిపాదించిన తెలుగు రాష్ట్రానికి స్వతంత్ర భారతదేశంలో సాకారమవుతుందను కున్నారు. జవహర్‌లాల్ నెహ్రూ కమిటీలు వేసి తాత్సారం చెయ్యటమేకాక, భాషా ప్రయుక్త రాష్ట్రాలను వ్యతిరేకిస్తున్నారని తెలిసి, తెలుగువారంతా తమ నిరసన తెలియజేయాలనుకున్నప్పుడు, తన 84వ ఏట అనారోగ్యాన్ని లెక్కచేయక, ఆ నిరసన ప్రదర్శనను ముందుండి నడిపించిన వ్యక్తి! 1930ల్లోనే ఆయన జాతీయస్థాయి నాయకుడిగా కాంగ్రెస్‌లో ఉండేవారు. అయితే 83 వయసు తర్వాత తప్పుకుని కొత్త తరానికి స్థానం ఇవ్వాలన్న ఆలోచన ఆయనలో ఉదయించింది. 1940ల నుండి జాతీయ రాజకీయాలకు దూరంగా ఉన్నారు. ఆయన స్థానంలో కాంగ్రెస్ ఏ తెలుగువ్యక్తిని నియమించినా వారిని అభినందిస్తూ, ఢిల్లీకి పంపిన కొండంత మంచి మనసు ఆయనది. ఆయనకు ఉన్న నైతిక బలం చాలా తక్కువ మంది దగ్గర కనిపిస్తుంది.

ఆయన ఏదైనా ఒక అంశం మీద ఉత్తరం రాశారు అంటే గాంధీ మహాత్ముడు వెంటనే దానిగురించే ఆలోచించేవారు. రాజకీయాలలో దిగజారిన నైతికవిలువలు, మంత్రులవగానే కాంగ్రెస్ వారు ప్రవర్తిస్తున్న తీరు మీద 1948వ సంవత్సరంలో ఆయన గాంధీజీకి ఒక ఉత్తరం రాస్తే, తనకందిన ఉత్తరాన్ని తన సాయంకాల ప్రార్థనా సమయంలో, గాంధీజీ అందరికీ చదివి వినిపించి నైతిక అంశంపట్ల హెచ్చరిక చేసారు. ఉత్తరం రాసిన గొప్ప నాయకుడు కొండావెంకటప్పయ్యే నన్నారు. అది ఆ కాంగ్రెస్‌లో ఉన్న నాయకుడికి ఆనాడు యిచ్చిన గౌరవం మర్యాద.

ఆయన కలలుకన్న తెలుగు రాష్ట్రం రూపుదాల్చకముందే 1948వ సంవత్సరంలో ఆయన కన్ను మూశారు. ●



# దేవులపల్లి వారి అబ్బాయి - బుజ్జాయి



బడికీ వెళ్లలేదు. పాఠాలు చదువుకోలేదు. తండ్రి వెనకాలే సాహితీ సభలకు వెళ్లడమే చదువు. ఇదే ఆయన విద్యాభ్యాసం. ఆ అనుభవాల్లోనే చదువులలోని సారమెల్లా తెలిసిందంటాడు – దేవులపల్లి కృష్ణశాస్త్రి గారి అబ్బాయి బుజ్జాయి.

'కృష్ణపక్షం' రోజులవి. భావకవిత్వ ఉద్యమం ఉధృతంగా సాగుతోంది. నాన్నగారే ఆ ఉద్యమ నాయకులు. ఏడాదిలోని పదకొండు నెలలూ ప్రయాణాలే! బళ్లారి నుంచి బరంపురం దాకా. సుదీర్ఘయాత్రలు! కొత్త కవిత్వాన్ని పరిచయం చేయాలనీ అందులోని మెలకువల్ని విప్పిచెప్పాలనీ ఆయనకెంత తపనో! నాన్నగారు ఇంటిపట్టున ఉన్నదే తక్కువ. అప్పుడే నేను పుట్టాను. పుట్టీపుట్టగానే నాన్నగారి ముందరికాళ్లకు బంధమేశాను. ఇల్లు కదిలితే ఒట్టు. ఆయనకు నేనే సర్వస్వం. నా నవ్వు, నా ఏడుపు, నా ఆట, నా మాట.. అన్నీ ఆయనకు అద్భుతమే. నా బోసినవ్వులతో ఆయన కడుపు నిండిపోయేది. అసలే మాది పెద్ద కుటుంబం. అంతమంది ఆకలి ఎలా తీరుతుంది? ఆ సంగతి రఘుపతి వెంకటరత్న నాయుడుగారికి తెలిసినట్టుంది. కబురుపెట్టారు. ఆయన నాన్నగారి గురువు. పట్టుబట్టి కాకినాడ కాలేజీలో తెలుగు ఉపాధ్యాయుడిగా వేయించారు. జీతం నలభై రూపాయలు.

మా తాతలు.. దేవులపల్లి సుబ్బరాయశాస్త్రి. కృష్ణశాస్త్రి (తమ్మన్నశాస్త్రి) పిఠాపురం ఆస్థాన కవులు. తమ్మన్నశాస్త్రిగారి అబ్బాయే నాన్నగారు. పెదనాన్న బొజ్జమీద కూర్చుని అమరకోశం చదువుకున్నాను.

ఓసారెప్పుడో పెద్దాయ్యాక, కొడుకుపుడితే ఎవరి పేరు పెడతావురా; అనడిగారట. 'మీ పేరే' అని మాటిచ్చారు నాన్నగారు. అందుకే నేను సుబ్బరాయశాస్త్రినయ్యాను. కానీ అందరికీ మాత్రం బుజ్జాయినే! ఉమ్మడి కుటుంబంలో గొడవలు రావడంతో ఆస్తుల పంపకాలు జరిగాయి. అది అన్నదమ్ములిద్దరికీ ఇష్టం లేదు. ఆ బాధతోనే ఒకరి తర్వాత ఒకరు పోయారు. అప్పటికి నాన్నగారి వయసు పన్నెండు. ఆయన చదువులకు పిఠాపురం రాజావారు చాలా సాయం చేశారు. కాకినాడలో ఇంటర్ చదివే రోజుల్లో వెంకటరత్నం నాయుడుగారు ప్రిన్సిపాల్. నాన్నగారిమీద ఆయన ప్రభావం చాలా ఎక్కువ. అప్పట్లో డిగ్రీ చదవాలంటే మద్రాసైనా వెళ్లాలి, విజయనగరమైనా వెళ్లాలి. విజయనగరంలో నాన్నగారి పెద్దక్క కుటుంబం ఉండేది. వాళ్లింట్లో ఉండి చదువుకున్నారు. పెళ్లయి, మూడేళ్లు తిరగకముందే డిస్పెప్సియా అనే వ్యాధి బారినపడ్డారు. ఏం తిన్నా జీర్ణమయ్యేది కాదు. మనిషి శుష్కించి పోయారు. కూర్చోడానికి కూడా ఓపిక ఉండేది కాదు. ఆయన 'కృష్ణపక్షం' పద్యాలన్నీ గోడలమీద పెన్సిలుతో రాసుకున్నవే. నాన్నగారికి జబ్బు కుదరింది కానీ సుబ్బలక్ష్మిగారికి టీబీ పట్టుకుంది. మద్రాసులో వైద్యం చేయించినా ఆమె దక్కలేదు. ఆ విషాదం తర్వాత కవిత్వమే ఆయన ప్రపంచమైపోయింది. వివాహంతో అయినా ఇంటిపట్టున ఉంటారేమో అని రాజహంసతో (మా అమ్మతో) పెళ్లి జరిపించారు. అయినా ఆయన కవితా యాత్రలు ఆగలేదు. తల్లావఝుల, ముద్దుకృష్ణమ, నండూరి– వంటి పెద్దల ప్రోత్సాహంతో 'కృష్ణపక్షం' పుస్తక రూపంలో వచ్చింది. అదో సంచలనం. పెనుదుమారం. నాన్నగారి భావకవిత్వ ప్రచారం మరింత జోరందుకుంది. ఈ సమయంలోనే నేను పుట్టాను. ఆ ఉమ్మడి కుటుంబంలో అందరి ప్రాణాలూ నామీదే. కొంతకాలానికి నాకో చెల్లి పుట్టింది. పేరు సీత. ముద్దుగా బొద్దుగా ఉండేది. అంతా 'బుల్లిసీత' అని పిలిచేవారు. ఎందుకంటే అప్పటికే మా ఇంట్లో నలుగురు సీతలున్నారు. నా ముద్దుల చెల్లెలు మశూచికంతో మరణించింది.


SRI RAJARAJESWARI JEWELLERY

The Oldest Jewellery Shop in Pondy Bazaar

81, Pondy Bazar, T. Nagar, Chennai - 600 017.
Phones : 28152387, 28154653

*The Purest Treasurer Mortal Times Afford is Spotless Reputation*


నాన్నగారికి రోగాలంటే భయం. అంటువ్యాధులున్న వారిని దగ్గరకు రానిచ్చేవారు కాదు. ఆ ఒక్క కారణంతోనే, ఊరొదలివెళ్లిన రోజులున్నాయి. నాలుగేళ్ల వయసులో నాకు మశూచికం వచ్చినప్పుడు మాత్రం, ఆయనకా భయాలేవీ గుర్తుకురాలేదు. నన్ను భుజానికెత్తుకుని హాల్లో పచార్లు చేశారు. జోకొట్టి నిద్రపుచ్చారు. మందుల కన్నా, నాన్న ప్రేమే బాగా పనిచేసింది. నా ఆరోగ్యం మెరుగుపడ్డాక, మళ్లీ ప్రయాణాలు మొదలయ్యాయి. ఈ సారి ఒంటరిగా కాదు. వెనకాలే నేను! నన్నెంతో ప్రేమగా చూసుకునేవారంటే, 'శాస్త్రి బుజ్జాయికి పాలివ్వడం తప్ప, అన్నీ చేస్తున్నాడు' అని హాస్యం చేసేవారు వెంకటరత్నం నాయుడుగారు.

నా బాల్యం నాన్నగారితోనే గడిచిపోయింది. ఒక్క క్షణం కూడా నన్ను వదల్లేక పోయేవారు. అందుకే స్కూలుకు కూడా పంపలేదు. అసలు ఆ ఆలోచనే రాలేదు. దానివల్ల మంచే జరిగింది. చదువే నా దగ్గరకు వచ్చింది. నాన్నగారి దగ్గరకు వచ్చే సాహితీవేత్తలు, కవులు, నటులు, చిత్రకారులు... అంతకంటే విలువైన పాఠాలు నేర్పించారు. ఆ విద్య పట్టాలకు పదిరెట్లు. ఆ ప్రపంచం విశ్వవిద్యాలయాలకంటే సువిశాలం. విశ్వనాథవారిని పెదనాన్నగారని పిలిచేవాణ్ణి. అడవి బాపిరాజుగార్ని బందరు బాబయ్య అని సంబోధించేవాణ్ణి. కాటూరివారూ నండూరివారూ నాకు మావయ్యలు! మా ఇంట్లో రోజూ సందడే. ఒక రోజు నాటకం, ఒకరోజు కవి సమ్మేళనం. ఒక రోజు గాత్రకచేరీ, అదో కళల కూడలి. ఎంతపెద్ద సభలో పాల్గొన్నా ఎంత ఉద్వేగంతో ఉపన్యసిస్తున్నా... నాన్న మనసెప్పుడూ నా మీదే. మొదటి వరసలో నేనుండాల్సిందే. ఓసారి విశాఖపట్నంలో బ్రహ్మాండమైన సభ జరిగింది. మాటలు, పాటలు, కవిత్వం, చలోక్తులు... సాహితీ ప్రియులకు అదో విందు! నాకు మాత్రం ఎందుకో ఆయన ఉపన్యాసం ఆపరేమో అన్న భయం పట్టుకుంది. 'ఇక ఆపు' అని గట్టిగా అరిచాను. 'నా ఉపన్యాసం ఆపేస్తున్నాను. మా అబ్బాయి ఆపెయ్యమంటున్నాడు' అని చెప్పేశారు. జనం వింటేగా! ఆయన ఉపన్యాసం ఆపకుండా ఉండటానికి ఎవరో నన్ను బయటికి తీసుకెళ్లి బిస్కెట్లూ గట్రా ఇప్పించారు. అప్పట్నుంచి ఆ వ్యక్తిని 'శీనూ శీనూ' అని పిలిచేవాణ్ని. ఆయనే శ్రీశ్రీ. ఏం చేయమంటారు. నోరుతిరిగేది కాదు. ఓసారి ఇలానే నేను ఉపన్యాసాన్ని అడ్డుకున్నప్పుడు విశ్వనాథ వారికి కోపం వచ్చింది. నాన్నగారికి మాత్రం నా మీద ఎప్పుడు కోపం రాలేదు. నాకూ ఓ వ్యాపకం ఉండాలి కాబట్టి. ఎక్కడికి వెళ్తున్నా ఓ డ్రాయింగ్ బుక్కు, పెన్సిలు కొనిచ్చేవారు. నేను రైలింజను బొమ్మలేస్తూ కూర్చునే వాణ్ని. ఆయనేమో ఉపన్యాసాల్లో లీనమయ్యేవారు. అలా ఆ సాధనే నన్ను చిత్రకారుడిని చేసింది.

అడివి బాపిరాజుగారు ఒళ్లో కూర్చోబెట్టుకుని రేఖాభ్యాసం చేయించారు. వల్లూరి జగన్నాధరావు అనే వాగ్గేయకారుడు నేలమీద సుద్దముక్కతో బొమ్మలు వేయడం నేర్పించారు. అలా నేనో చిత్రకారుణ్ణయ్యాను. ●

# ఆచార్య మామిడిపూడి వెంకట రంగయ్య జననమూ జనవరి! మరణమూ జనవరి!



ఆచార్య మామిడిపూడి వెంకట రంగయ్య ఆర్థిక, రాజకీయ శాస్త్రాలలో గొప్ప పండితుడు. బహుముఖ ప్రజ్ఞానిధి. తెలుగునాట ఎందరికో ఆచార్యత్వం వహించిన అగ్రశ్రేణి మేధావి. మేధావులకే మేధావి, విజ్ఞాననిధి!

మద్రాసు మెరీనాబీచ్‌లో ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు శ్రీ బిపిన్ చంద్రపాల్ ఉపన్యాసాలు ఆయనలో ప్రగాఢ స్వాతంత్ర్యాభిలాషను, జాతీయోద్యమ పిపాసను పెంపొందించాయి. అందువల్లనే, తన సహాధ్యాయులైన శ్రీ శొంఠి రామమూర్తి తదితరుల మాదిరిగా– సివిల్ సర్వీసుల్లో చేరడానికి ఆయన నిరాకరించారు. దాంతో స్వతంత్ర్య జీవితానికి అడ్డంకులుండని అధ్యాపక వృత్తిని స్వీకరించారు. ఆరు దశాబ్దాలకు పైగా ఎందరినో విద్యావంతుల్ని చేశారు.

**విద్యను మించినదేదీ విశ్వమున లేదోయీ!**

1889 జనవరి 8న నెల్లూరు జిల్లాలోని 'పురిణి' అనే గ్రామంలో శ్రీ మామిడిపూడి వెంకటరంగయ్య జన్మించారు. చిన్నతనంలోనే భారత రామాయణ గ్రంథాలతోపాటు వేదాలను అధ్యయనం చేశారు. మద్రాసు విశ్వవిద్యాలయం నుండి ఎంఏ పట్టాపొంది, రఘుపతి వెంకటరత్నం నాయుడు గారి ఆహ్వానం మేరకు కాకినాడలోని పిఠాపురం రాజావారి కళాశాలలో చరిత్రోధ్యాపకునిగా పనిచేశారు. తర్వాత విజయనగరం కళాశాలలో 1927 వరకు అధ్యాపకునిగా పనిచేశారు. విజయనగరపు సంస్థాన ట్రస్టీ అభ్యర్థన మేరకు, అప్పటి విజయనగర యువరాజు అలకనారాయణ గజపతికికి విద్యనేర్పారు. అలకనారాయణ గజపతి సంస్థానం ఆధిపత్యం చేపట్టాక 1927లో శ్రీవెంకటరంగయ్యగార్ని సంస్థానపు దివానుగా నియమించారు. స్వాతంత్రోద్యమం పట్ల సానుభూతి కల్గిన శ్రీ మామిడిపూడి సంస్థానపు దివానుగా ఉండటం ఆనాటి మద్రాసు ప్రభుత్వానికి ఇష్టం లేకున్నది, అది గమనించి సంస్థానాధిపతి శ్రీ అలకనారాయణ గజపతి ఆయన జీవితాంతం వరకూ రూ॥ 200/– పెన్షన్ చెల్లించే ఏర్పాటు చేశారు. ఆ తర్వాత 1928–31లో నెల్లూరుజిల్లాలోని వెంకటగిరి రాజా కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణన్ కోరిక మీద 1931 నుండి 1944 వరకు సుమారు 14 సంవత్సరాల పాటు ఆంధ్ర విశ్వవిద్యాలయంలో రాజనీతి శాస్త్ర శాఖాధ్యక్షులుగా పనిచేసిన అనంతరం భీమవరం కాలేజీ ప్రిన్సిపాల్‌గాను, ముంబాయి యూనివర్శిటీ పాలిటిక్సు ప్రొఫెసరుగా పనిచేశారు. చరిత్ర, రాజనీతిశాస్త్రం పరిపాలనా సంబంధమైన అంశాల్ను బోధించారు. అసంఖ్యాకులైన తన శిష్యుల హృదయాలపై అధ్యాపకునిగా చెరగని ముద్రవేశారు. ఎందరో శిష్యులు నేడు పలు ఉన్నత పదవులలో ఉన్నారు. ఆయన రాసిన అనేక గ్రంథాల్ను అమూల్య సంపదగా విజ్ఞాన ఖండికలుగా చరిత్ర, రాజనీతి శాస్త్ర పరిశోధకులు భావిస్తారు. నూరు గ్రంథాలకు పైగా ఆయన రచించారు. మైసూరు, ముంబాయి, పూనా, బరోడా, లహోర్, ఢిల్లీ, బనారస్, కలకత్తా, ఢాకా, హైదరాబాదు, నాగపూరు– ఇలా పలు విశ్వవిద్యాలయాలకు పరీక్షాధికారిగానో, బోర్డ్ ఆఫ్ స్టడీస్‌లో సభ్యునిగానూ వ్యవహరించారు.

'ఇండియా', 'ఎడ్యుకేషన్' సంపాదకులుగా, ఇండియన్ పొలిటికల్ అసోసియేషన్ అధ్యక్షులుగా, ఆకాశవాణి మద్రాసు కేంద్ర విద్యా ప్రసారాల సలహా సంఘ సభ్యులుగా ఆయన పనిచేశారు. చరిత్రోపన్యాసకులుగా యావత్ భారతంలో కీర్తినార్జించిన మామిడిపూడి వారిని 1968లో కేంద్ర ప్రభుత్వం 'పద్మభూషణ్' పురస్కారంతో సత్కరించింది. శ్రీమామిడిపూడి కౌటిల్యుని అర్థశాస్త్రాన్ని తెలుగులోకి అనువదించారు.

ఆంధ్రప్రదేశ్‌లో గ్రంథాలయోద్యమం, బ్యాంకింగ్ ఉద్యమం, వయోజన విద్య, ఖాదీ ఉద్యమాలపై వివరణాత్మక వ్యాసాలు, వ్యాఖ్యలు అనేకం రాశారు. రాష్ట్రంలో పంచాయితీరాజ్ వ్యవస్థను అధ్యయనం చేసి 'ఆంధ్రప్రదేశ్‌లో పంచాయతీ రాజ్' ఆంగ్ల గ్రంథం రచించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆహ్వానం మేరకు ఆంధ్రప్రదేశ్‌లోని స్వాతంత్ర్య పోరాటపు చరిత్రను క్రీ.శ. 1800 నుండి 1947 వరకు రాయడానికి 1961లో అంగీకరించి 1970లో పూర్తిచేశారు. ఆంధ్రాటీచర్స్ ఫెడరేషన్‌కు అధ్యక్షులుగా ఉన్నారు. పాఠ్యగ్రంథాలు నుంచి రాజ్యాంగ వివరణల దాకా అనేక పుస్తకాలు రాశారు. తెలుగు భాషా సమితి ప్రచురించే విజ్ఞాన సర్వస్వం, సంగ్రహ విజ్ఞాన కోశాలకు సంపాదకులుగా, అగ్రశ్రేణి మేధావిగా, విద్యారంగంలో అపరభీష్మాచార్యగా కీర్తిగడించిన ఆచార్య మామిడిపూడి వెంకటరంగయ్య 92 సం॥ సంపూర్ణ వయస్సులో జనవరి 13, 1982లో తన తుదిశ్వాస విడిచారు. ఆఖరిక్షణం వరకూ సాహిత్య విద్యా విషయక చర్చల్లో కాలం గడిపిన శ్రీమామిడిపూడిని నేటి విశ్వవిద్యాలయ ఆచార్యులు ఎందరో గురుతుల్యునిగా గౌరవిస్తారు.

**(మల్లాది కృష్ణానందక్‌కు కృతజ్ఞతలతో)**

రుచికి, సువాసనకి, ఆరోగ్యానికి నాణ్యమైన
"అజంతా"
వక్కపొడి
రవికుమార్ అండ్ కంపెని – చెన్నై
044 25204046, 26171341

Beautiful City - Beautiful Hotel

DO NOT MISS
Foreverar your Serivice in the Heart of Visakhaparnam
HOTEL Daspalla
Suryabagh, Visakhapatna - 520 020, A.P., India.
Ph : 2564825 (6 Lines), 2563141 (4 Lines), Fax : 91-0891-2562043
E-mail : dspvizag1@rediffmail.com, Visit us at : www.daspallahotels.com
Call National Toll Free No. : 1800-425-4225

# పద్మశ్రీ, పద్మభూషణ్ బిరుదులందుకున్న తెలుగు శాస్త్రవేత్త ఎ.ఎస్.రావు

ఆయన పూర్తిపేరు అయ్యగారి సాంబశివరావు. అయితే ఎ.ఎస్.రావు అంటేనే పలువురికి తెలుసు. ఆయన భారతదేశం గర్వించదగ్గ గొప్ప శాస్త్రవేత్త. హైదరాబాద్‌లో ఆయన పేరిట పెద్ద టౌన్‌షిప్ అభివృద్ధి అయింది. సికింద్రాబాద్ కంటోన్మెంటు దాటాక సైనిక్‌పురి నుంచి కాప్రా సర్కిల్‌దాకా గల ప్రాంతాన్నంతా 'ఏఎస్‌రావు నగర్'గా పిలుస్తున్నారు. నేటి కాప్రా జంక్షన్ 1960వ దశకంలో నగరపొలిమేరల్లో ఉండేది. అదొక చిట్టడివి లాంటి ప్రాంతం. అలాంటి ప్రాంతంలో భారతదేశానికి తలమానికమైన ఎలక్ట్రానిక్స్ సంస్థను ఎ.ఎస్.రావు స్థాపించారు. ఎందరో యువశాస్త్రవేత్తలకు ఈ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించారు.

డా॥ హోమీబాబా, డా॥ విక్రం సారాభాయ్, డా॥ ఎస్.భగవంతం వంటి అత్యున్నత శ్రేణి భారతీయ శాస్త్రవేత్తలతో ఎ.ఎస్.రావు చాలా సన్నిహితంగా పనిచేశారు. భారతీయ యువ శాస్త్ర వేత్తలలో నిరుపమాన శక్తి సామర్థ్యాలున్నాయని ఆయన విశ్వ సించారు. వారి సేవలు వినియోగించుకునేందుకే ఆయన 'బాబా కమిటీ' పేరిట ఒక అత్యున్నత స్థాయి ఎలక్ట్రానిక్స్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ భారతదేశంలో ఎలక్ట్రానిక్స్ పరిశ్రమ అభివృద్ధికి పలు అంశాలతో ఒక ప్రగతినివేదికను రూపొందించింది. ఆయన అపారఅనుభవం ఇందు ఎంతగానో ఉపయోగపడింది. ఈ నివేదిక ఆధారంగానే ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఇసిఐఎల్) హైదరాబాద్‌లో స్థాపించారు. తొలి ఛైర్మన్‌గా విక్రం సారాభాయ్, ఎ.ఎస్.రావు మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. రావు సారథ్యంలో మొదటి పది సంవత్సరాల కాలంలోనే ఇసిఐఎల్ గణనీయమైన అభివృద్ధి సాధించింది. అధిక స్థాయిలో ఎలక్ట్రానిక్స్ ఉపకరణాలను ఉత్పత్తి చేసింది. ఎందరికో ఉద్యోగావ కాశాలను కల్పించింది. ఎ.ఎస్.రావు నేతృత్వంలో ఇసిఐఎల్ ఉత్పత్తి రంగంలోనే గాక, ఉద్యోగస్థులతో సంబంధ బాంధవ్యాలలోను పలు ప్రభుత్వ, ప్రైవేటు రంగసంస్థలకు ఆదర్శంగా నిలిచింది.



ఎ.ఎస్.రావు 1914 సెప్టెంబర్ 20న పశ్చిమగోదావరి జిల్లా లోని మోగల్లు గ్రామంలో జన్మించారు. బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం నుండి ఫిజిక్స్‌లో ఎం.ఎస్సీ, తర్వాత రీసర్చి స్కాలర్‌గా అక్కడే ఆరేళ్లు పనిచేశారు. 1946లో ప్రతిష్టాత్మకమైన టాటా స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారు. తద్వారా అమెరికాలోని స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయంలో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో మాస్టర్స్ డిగ్రీ చేశారు. అమెరికానుండి తిరిగి వచ్చాక ముంబైలోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసర్చి ఇన్‌స్టిట్యూట్‌లో కాస్మిక్ రేస్‌కి సంబంధించిన పరిశోధనలో సహక రించవలసిందిగా కోరుతూ హెచ్.జె. బాబా ఆయనకు ఆహ్వానం పంపారు. ఆలా రావు చేపట్టిన తొలి ప్రయోగాలు విజయవంతం కావడంతో భాబానే స్వయంగా రావుని అభినందించి టాటా ఇన్‌స్టిట్యూట్‌లో రీడర్ పోస్టులో నియమించారు. ఇండియాకు చెందిన ఆటమ్స్ ఎనర్జీతో కలిసి తొలినాళ్ల నుండి రావు సన్నిహిత సంబంధం కలిగి ఉన్నారు. 1953లో బాబా అటామిక్ రీసర్చి సెంటర్‌లో (బార్క్ BARC) నియమితులయ్యారు. ఆసియా ఖండంలోనే తొలిసారిగా రూపుదిద్దుకున్న న్యూక్లియర్ రియాక్టర్ 'అప్సర' డిజైనింగ్, మానిటరింగ్‌లో రావు ప్రధాన భూమిక పోషించారు. 1955లో 'అప్సర' విజయవంతంగా ప్రయోగించారు. పశ్చిదేశీయులందరినీ ఆశ్చర్యపరచిన 'అప్సర' న్యూక్లియర్ రియాక్టర్ మన దేశంలో తొలిసారిగా భారతీయ శాస్త్రవేత్తలు రూపొందించినదిగా ఖ్యాతిగాంచినది. ఆ తరువాత వీరి నేతృత్వంలో 40 ఎండబ్ల్యు హెవీవాటర్ బేస్డ్ రియక్టర్ సర్క్యూట్, మూడవ న్యూక్లియర్ రియాక్టర్ 'జెర్లీనా' అణుప్రయోగం, రేడియో ధార్మిక విడుద ప్రమాద సూచికలపై రావు విస్తృత పరిశోధనలు చేశారు. ఎందరో యువ శాస్త్రవేత్తలను ఆయన నియమించారు. ఎలక్ట్రానిక్స్ గ్రూప్ బార్క్ డైరెక్టర్ హోదాలో మన దేశంలో ఎలక్ట్రానిక్స్ రంగం అభివృద్ధికి ఆయన గట్టి పునాదులు వేశారు. 1960వ దశకంలో మన దేశంపై చైనా దురాక్రమణ తర్వాత రక్షణ, న్యూక్లియర్ కార్యక్రమాల అమలులో ఎలక్ట్రానిక్స్ వినియోగ ప్రాధాన్యం గుర్తించి, 1963లో జాతీయ స్థాయిలో భారత ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీ ఛైర్మన్‌గా బాబా, సభ్యులుగా విక్రం సారాభాయ్, భగవంతం, ఎ.ఎస్.రావులను ప్రభుత్వం నియమించింది. ఈ కమిటీ అత్యున్నతస్థాయి నివేదికను బాబాకమిటీ రిపోర్ట్‌గా ప్రభుత్వానికి సమర్పించింది. ఈ నివేదిక ప్రధానోద్దేశ్యం ఎలక్ట్రానిక్స్ రంగాన్ని పటిష్టవంతంగా అభివృద్ధిపరచాలి. విదేశీ పరిజ్ఞానంపై ఆధారపడ కుండా, యువశాస్త్రవేత్తలను, ఇంజనీర్లను ప్రోత్సహిస్తూ అభివృద్ధి చెందిన దేశాలతో దీటుగా ఈ రంగాన్ని అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పేర్కొన్నారు.

ఇసిఐఎల్‌ను 1967 ఏప్రిల్ 11న హైదరాబాద్ శివార్లలో ఏర్పాటు చేశారు. ఇసిఐఎల్ గణనీయ మైన ప్రగతిని సాధించిందంటే ఎ.ఎస్.రావు వేసిన గట్టి ప్రణాళిక వ్యూహరచనే అని భారతీయ శాస్త్ర వేత్తల బృందం ముక్తకంఠంతో అంగీకరిస్తుంది. ఎ.ఎస్.రావు ఇసిఐఎల్ మేనేజింగ్ డైరెక్టర్‌గా 1978 మే 31న పదవీ విరమణ చేశారు. భారతదేశంలో నిరుద్యోగ సమస్య పరిష్కారానికి ఎలక్ట్రానిక్స్ పరిశ్రమ ఇతోధికంగా సహాయపడుతుందని రావు సుమారు అయిదు దశాబ్దాల క్రితమే ఊహించారు. ఎ.ఎస్.రావు కెల్‌ట్రాన్, సెంట్రల్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్‌కు ఛైర్మన్‌గా, అంతర్జాతీయ ఖ్యాతిగల అనేక శాస్త్రసాంకేతిక రంగ జర్నల్స్‌కు, మన దేశంలో ప్రచురించే అనేక శాస్త్రరంగ పత్రికలకు సంపాదకవర్గ సభ్యునిగా, సలహాదారుగాను పనిచేసారు. శాస్త్రసాంకేతిక రంగంలో రావు సేవలకు గుర్తింపుగా 1960లో 'పద్మశ్రీ' అవార్డు 1972లో పద్మభూషణ్ అవార్డును ప్రదానం చేసింది. అందుకున్నారు. శాంతిస్వరూప్ భట్నాగర్ అవార్డు (1965), ఆంధ్ర విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేటు (1969) లభించాయి. రావు 1974లో 'ఫెలోషిప్ ఆఫ్ ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్' (బెంగుళూరు)క ఎంపికయ్యారు. 'గ్రోయింగ్ సైన్స్ మెథడ్స్' విధానం, రావు ప్రత్యేకతగా ఆయన సమకాలీన శాస్త్రవేత్తలు తరచూ చెబుతూంటారు. ఇన్ని ఘన విజయాలు సాధించిన రావు 2003 మే 31న తుది శ్వాస విడిచారు.

(మల్లాది కృష్ణానంద్ సౌజన్యం)

*Compliments from*
**Sri Krishna Bhat**
When you come to
Holy Pilgrimage Centre Tirupati & Tirumala
**WOOD SIDE ANNEXE**
Opp. to Govindarajulu Temple, 20. E.car Street, Tirupathi.
**WOODSIDE**
**HOTEL WOODSIDE**
E.Car Street, Tirupathi. Ph : 2284464

# విశాలహృదయుడూ, విద్యాప్రదాత, వితరణశీలుడైన విద్వాన్ గోగినేని కనకయ్యగారు లేరు
## -విషాద వార్తను జీర్ణించుకోలేకపోతున్నాను-


ఆరడుగుల మనిషి! ఆ పంచెకట్టు, లాల్చీ ఆపైన ఉత్తరీయమూ చూచినపుడు ఆయన విద్యా సిరిమంతుడనిపించాడు. సిరిచిరునవ్వుల విరిసే వదనం కనకపు కనకయ్య గారి స్వంతం. ఓ దశాబ్దకాలం వారి సహచర్యం లభించింది. గుంటూరు వెడితే గోగినేని గెస్టు హౌసే నా రెస్టు హౌస్.

ఒక పర్యాయం వారు – ఓ ఫోటో స్టూడియోకు తీసుకుని వెళ్లారు. ఎందుకో అనుకున్నాను. – మనం ఇద్దరమూ ఫోటో తీయించుకుందాం – అని ఫోటో తీయించారు. చాలా రోజుల తరువాత ఫోటో స్టూడియోకు వెళ్లి ఫోటో దిగాను.

ఫోటోగ్రాఫర్‌తో– బాగా రావాలి అబ్బాయ్ ఆయన నాకెంతో గౌరవనీయులు– అన్న ఆయన మాటను– ఇప్పటికీ జ్ఞాపకం చేసుకుంటాను.

**విద్యాసంస్థలపైననే ఆయన దృష్టి**

ఆయన తన జీవితం కన్నా తాను స్థాపించిన విద్యాసంస్థల నెవరు బాధ్యతగా చూస్తారనెడి బాధ ఆయనకు ఎక్కువగా ఉండేది. ఆయన మనుమడు 'రాయపాటి సాయికృష్ణమోహన్‌ను రోజూ దగ్గరకు పిలిపించి, తర్ఫీదును యిచ్చారు. తాతగారి విద్యా సంస్థల్ని పరిరక్షణా బాధ్యతతో చూడడానికి సాయికృష్ణమోహన్ యిచ్చిన భరోసా ఆయన మనసుకు స్థిమితం కల్గింపచేసినది. ఆయన అనారోగ్యం పడినప్పట్నుంచి చివరివరకూ – సాయికృష్ణమోహన్ కంటికి రెప్పలా చూసుకున్నాడు. కనకయ్య వంటి కనకాన్ని చూడలేము! ●



*కనకయ్యగారు పూర్ణపురుషుడు. నిండునూరేండ్లు జీవించారు. పెక్కు విద్యాలయములు తాడికొండలో నెలకొల్పారు. ఆయన స్థాపించిన విద్యా సంస్థలెన్నని చెప్పగలం అసంఖ్యాకం. ఆయనకు భగవాన్ సత్యసాయి బాబా పట్ల భక్తి అమేయం. భగవాన్ సత్యసాయి విద్యాలయముల రీతినే జ్ఞానపూర్వకమైన సిలబస్‌ను అమలుచేసారు. ఆదర్శవంతమైన అధ్యాపకులను ప్రోత్సహించారు. స్వంత వనరులతో పాఠశాలలకు భవనవసతి కల్పించారు. తాడికొండ ప్రధాన వీధి లోనికి అడుగిడినప్పట్నుంచీ, ఆ వీధి చివరివరకూ గోగినేని కనకయ్య వితరణతో స్థాపింపబడిన విద్యా సంస్థలే కనిపిస్తాయ్.*

## 60 సం॥రాల క్రితం మరిప్పటి సంవత్సర ఫిబ్రవరి 16 తీయని వెన్నెల రోజు తీరని చీకటి రోజు



మూడవ కోడలు చి॥సౌ॥ సుప్రీతతో

*వత్సర వరుసక్రమంలో 60 వసంతముల తరువాత ప్రభవ ఉగాది వస్తుంది. కలకల నవ్వులు తెస్తుంది! కానీ నా జీవితంలో ప్రభవ ప్రభవించకపోగా, దుర్ముఖ ఛాయలు చైత్ర వసంతము సంతసమును తుణా తుణకులు కావిస్తూ, విచార పారావరపారంగా వికృతంగా విచార ఛాయల్లోకి నెట్టుచున్నవి.*

*1956 ఫిబ్రవరి 16న సత్యవతితో వివాహం జరిగిన ఆనంద నంద సుందర సుదినం జీవితంలో ప్రముద్రితమైంది. అమెరికా నయగారా జలపాత తీరంలో మనసుపడి తీయించుకున్న నిశ్చల చిత్రం 2016 ఫిబ్రవరి 16 హృద్వారిజనేత్రిగా స్థైర్యం ప్రసాదించకలదని...*

# హెలికాప్టర్‌తో బంగ్లాదేశ్‌లో దిగారు

## ఎయిర్‌క్రాఫ్ట్ పూర్వపు ఇంజనీర్ రామకృష్ణ అనుభవం






**మా** పశ్చిమ గోదావరి వల్లూరువాసి. ఇంటిపేరు కూడా వల్లూరు! వంటిపేరు రామకృష్ణ.– హెలికాప్టర్ చెట్టాపట్టాలూ; వాయుసేన మధ్య నే రిపేర్లూ! ఆయనే చూచేవారు! ఆయన అనుభవాలే ఆయన మాటల్లో –

**మా**ది పశ్చిమగోదావరి జిల్లాలోని వల్లూరు. ఆంధ్రా యూనివర్శిటీ నుంచి 1963లో మెకానికల్ ఇంజనీరు పట్టాపుచ్చుకున్నాను. తర్వాత ఏడాది ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెన్స్ ఇంజనీర్‌గా రక్షణరంగంలో ఉద్యోగం లభించింది. బెంగుళూరులో ఏడాది శిక్షణ పొందిన తర్వాత చండీఘర్‌లో నాకు తొలి పోస్టింగ్ వచ్చింది.

నాకు ఎక్కువగా హెలికాప్టర్లతోనే పని! భారత హెలికాప్టర్ ఒకటి చైనా సరిహద్దులో (మన భూభాగంలో) కూలిపోయింది. దాని మరమ్మతు బాధ్యతను నాకప్పగించారు. మరో ఇద్దరు టెక్నీషియన్లతో అక్కడికి బయల్దేరాను. రోడ్డు కాదు కదా అక్కడకు కాలిబాట కూడా లేదు.ఎటుచూసినా మంచు కొండలు! లోయలే! కష్టపడి అక్కడికి చేరుకున్నాం. మనిషి ఆనవాలే లేదక్కడ. రెండు రోజులకో హెలికాప్టర్ వచ్చి మాకు ఆహారం, మంచి నీటిని అందించేది. అలా 45 రోజులు అక్కడే ఉన్నాం. ఒకసారి స్థానిక గిరిజనులు వారి పనుల మీద వెళ్తూ మమ్మల్ని గమనించారు. వారు వండుకున్నది (ఆకులతో వండిన పదార్థం పేరు తెలియదు) మాకు పెట్టారు. అమృతంలా అనిపించింది.

❊ ❊ ❊

బంగ్లాదేశ్ యుద్ధం (పాకిస్తాన్ యుద్ధం)లో నాకు ప్రత్యేకమైన అసైన్‌మెంట్ ఇచ్చారు. కొత్తగా ఉద్యోగంలో చేరిన 20 మందికి ఒక రహస్య ప్రదేశంలో హెలికాప్టర్ ఇంజనీరింగ్‌లో శిక్షణ ఇవ్వడం నా బాధ్యత. నెలరోజులపాటు శిక్షణ ఇచ్చిన తర్వాత మేము నిర్వహించిన తొలి ఆపరేషన్ బంగ్లాదేశ్ భూమ్మీద దిగడం. ఆ యుద్ధంలో పాకిస్తాన్‌ని ఓడించిన తర్వాత బంగ్లాదేశ్ (అప్పట్లో అది తూర్పు పాకిస్తాన్) నేలమీద దిగిన తొలి బృందం మాదే! అది పాకిస్తాన్ వదలివెళ్లిన తర్వాత బంగ్లాదేశ్ ప్రభుత్వ వ్యవస్థ ఏర్పాటుకు మధ్య సంధికాలం. బ్యాంకులు, దుకాణాలు అన్నీ ఎలా తెరచినవి అలానే ఉన్నాయి. పాక్ సైన్యం ఓటమి పరాభవంతో అనేక అకృత్యాలకు పాల్పడుతోంది. ఆ సమయంలో భారత సైన్యం బంగ్లాదేశ్ రక్షణ బాధ్యతలను తీసుకుంది.

యుద్ధంలో బుల్లెట్లు తగిలి హెలికాప్టర్ రెక్కలకు చిల్లులు పడేవి. వాటిని తిరిగి పనిచేయించాలంటే చండీఘర్ నుంచి విడి భాగాలు రావాలి. యుద్ధ సమయంలో అంత సమయముండదు. స్థానికంగా దొరికే ఎమ్‌సీల్ వంటిది సేకరించి చిల్లులను అతికించి హెలికాప్టర్లను వాడుకలోకి తెచ్చాను. అందుకు మా ఎయిర్‌ఫోర్సు అధికారి నాకు 1971లో ప్రశంసాపత్రం ఇచ్చారు. తరువాత అస్సాంలో మారుమూల ప్రాంతం కుంభిగ్రామ్‌కు బదలీ అయింది. వెదురు గుడిసెల్లో మంచెలమీద నివాసం. జంతువులు, పాములు కనిపిస్తుండేవి. ఏనుగుల ఘీంకారాలు వినని రోజుండేది కాదు. అలాంటి పరిస్థితులలో ప్రతి ఆదివారం అన్ని కుటుంబాల వాళ్లం కలిసి పార్టీ చేసుకునేవాళ్లం. చనాబటూరా మాకు పెద్ద విందు!

పిల్లలు స్కూలుకెళ్లాలంటే 40 కిలోమీటర్ల దూరం కొండల మధ్య ఇరుకు దారులు తప్ప మంచి రోడ్డుండదు. తీస్తా నది మీద వంతెన ఊగుతుంటుంది. ఏ మాత్రం చూపుమరల్చినా వాహనం తీస్తానదిలో ఉంటుంది. కొండచరియలు విరిగి పడితే, ఆర్మీవాళ్లు వెళ్లి దారిని క్లియర్ చేస్తేనే బస్సు ముందుకు కదుల్తుంది. అలాంటి పరిస్థితుల్లో స్కూలు బస్సు ఇంటికి రావడం ఓ గంట ఆలస్యమైతే చాలు... నేను చీఫ్ ట్రాన్స్‌పోర్ట్ అధికారిని కావున పిల్లల తల్లిదండ్రులు మా ఇంటికి వచ్చేసేవారు. మా పిల్లలు కూడా అదే బస్సులో ఉండేవారు. ఒకసారి సుడిగాలి రావడంతో మా చిన్నబ్బాయి (ఎనిమిదేళ్లుంటాయి). గొడుగు వేసుకుని ఇంటి బయటికి వచ్చాడు. గాలికి గొడుగుతోపాటు పైకి లేచాడు. నాలుగైదు అడుగుల దూరం అలా గాల్లోనే వెళ్లి కిందపడ్డాడు. తాత్కాలికంగా భయపడినా కూడా సంతోషంగానే ఉద్యోగం చేసా అంటారు" రామకృష్ణ. ●

**చాలామంది తప్పగా అల్పాహారం అంటారు –**
**తప్పని గ్రహించండి; ఉపాహారం అనండి!**

## సీమాంధ్ర శంఖుస్థాపనమునకు వచ్చినవారందరికీ ఆంధ్రా భోజనం! ఆహారంలో గోంగూర

**ఈ** కార్యక్రమానికి హాజరయ్యే ప్రముఖులందరికీ ప్రత్యేక భోజనం. ఉపహారాన్ని అందించారు. సూప్‌లు, భోజనం, పండ్లు, ఇతర స్నాక్స్ తదితర పదార్థాలను పంపిణీ చేశారు. లెమన్ జ్యూస్, గ్రీన్ సలాడ్, మొలకెత్తిన గింజలు, మొక్కజొన్న సలాడ్ కూడా అందించారు. గోంగూర పచ్చడి, మిరియాల రసం, కొత్త ఆవకాయ, వంకాయ పచ్చిపులుసు, మెంతీ మజ్జిగ, కొబ్బరి చట్నీ, పచ్చి జామకాయ పచ్చడి, కరివేపాకు కారం, కొబ్బరి శనగకారం, అప్పడాలు, మిఠాయికిళ్లీ, సాధారణ కిళ్లీలు కూడా సరఫరా చేశారు. వీవీఐపీలకు పూర్ణం, డ్రైఫ్రూట్స్, కార్న్ సమోసా, రియల్ ఫ్రూట్ జ్యూస్ అందించారు.

# నాగేశ్వరరావుగారు హీరోగా ఉన్నప్పుడే కపిల నాగేశ్వరరావు బాలహీరో!



ఇంటిపేరు కపిలవారు. ఊరు పాలకొల్లు. పేరు నాగేశ్వరరావు. వాళ్ల తండ్రి కపిల సుబ్బారావు. అప్పటికప్పుడు పిల్లల పాత్రలకు రెడిమేడ్‌గా దొరకాలంటే కపిలసుబ్బారావు గారింటికి వెడితే చాలు! సైజులు వారీగా, వయసువారిగా– సినిమా కెమెరా ఎదుట బెదురు లేకుండా కేమెరామెన్ చెప్పిన కోణం (ఏంగిల్)లో నిలబడి అసిస్టెంట్ డైరెక్టర్, డైరెక్టర్లు శ్రమపడకుండా సంభాషణ చెప్పగల బాల నటులు దొరికేవారు. బాలనటుడు కావాలనుకున్నప్పుడు కపిల నాగేశ్వరరావును తీసుకుని వెళ్లేవారు. కొన్నాళ్ళు అక్కినేని నాగేశ్వరరావు నటించే పాత్రల్లో చిన్నవయసువానిగా కపిల నాగేశ్వరరావే నటించేవాడు.

నాగేశ్వరరావు తండ్రి పాలకొల్లులో చిన్నచిన్న వైద్యాలు చేసే కాంపౌండర్‌గా ఉండేవాడు. ఆయన హిందీ సినిమా ల్యూసి తన పిల్లల చేత నటింపచేస్తూండేవాడు.

పాలకొల్లులోని ప్రఖ్యాత నాటక కర్త, నటుడు, దర్శకుడైన పినిశెట్టి శ్రీరామమూర్తి ఈ పిల్ల నాటకం చూచి, వారి నటనకు అబ్బురపడ్డారు. పిల్లల్ని మద్రాసుకు తీసుకువస్తే, సినిమా వేషాలకు సిఫార్సు చేస్తామన్నారు. పినిశెట్టిగారు అప్పటికే వాహినీ వారి స్టోరీ డిపార్టుమెంటులో పనిచేస్తున్నారు. వారి నాటకం **పల్లె పడుచు** చిత్రంగా నిర్మింపబడుతూంది.

పినిశెట్టి శ్రీరామమూర్తిగారు వారి భావాలకు సరితూగే అనిశెట్టి సుబ్బారావు గారితో కలిసి జంటకవులుగా కొన్ని తెలుగు చిత్రాలకు రచనం చేస్తున్నారు. ఫీల్డులో స్థిరపడ్డారు. కపిల సుబ్బారావుగారు పినిశెట్టిగారిచ్చిన భరోసాతో సకుటుంబంగా మద్రాసు వచ్చి చెన్నయ్ తేనాంపేటలోని లాడ్జీలో దిగారు.

లతామంగేష్కర్ గొంతులో 'నిదురపోరా తమ్ముడా' పాటపాడిన బేబీ విజయలక్ష్మి చిట్టి తమ్ముడే ఈ 'మాస్టర్' నాగేశ్వరరావు. బాలనటుడిగా అరంగేట్రం చేసి, హీరోగా వెండితెరపై చక్రం తిప్పుదామనుకున్నాడు కానీ, సినిమా వైకుంఠపాళిలో కమల్‌హాసన్ లాంటి ఒకరిద్దరికి తప్ప అందరికీ అది సాధ్యపడదని అవగాహనమయింది. బాలనటుడిగా రాజుపేద, చంద్రహారం, తోడుదొంగలు రేచుక్కతోపాటు సంతానం (నిదురపోరా తమ్ముడు) లాంటి గుర్తుండిపోయిన పాత్రల్లో మాస్టర్ కె.నాగేశ్వరరావు ప్రతిభను చూపించాడు. ఆయన మాటల్లో విషయం విందాం :

మాది పాలకొల్లు. నేను జూలై 4, 1945న పుట్టాను. నలుగురం అన్నదమ్ములం. అప్పట్లో మా కుటుంబాన్ని 'బాల నటుల కుటుంబం' అనే వారు. మా నాన్న డా. కపిల సుబ్బారావు ఊర్లో వైద్యుడు. కాంపౌండర్ రెండూ! స్వతహాగా ఆయన నటులు కావడం వల్ల నాటకాలు వేయడమేకాదు వేయించే వారు. పిల్లల్ని కూడా నటులుగా చూడాలని ఆయన కోరిక. పాలకొల్లు రత్నం టాకీసులో 'నవ్వే మున్నే' చిత్రాన్ని చూసిన తర్వాత సినిమాల్లో నటించాలనే అభిప్రాయం. మా మనఃఫలకాల్లో స్థిరపడిపోయేట్టు చేసారు. మా అభిరుచికి మా నాన్నగారి సదాశయం తోడైంది. 'మంచిరోజులు' అనే నాటకాన్ని రాసి ఆయనే మాకు తగు శిక్షణనిచ్చి నటింపచేశారు. అది మాకు తొలి నాటకమైనా ప్రతిభావంతంగా, అనుభవం ఉన్న వాళ్లలా నటించాం. ప్రముఖ, నాటక, సినీ రచయిత పినిశెట్టి శ్రీరామమూర్తిగారు మా నాటకం చూసి ఎంతో ఆనందపడ్డారు. మమ్మల్ని



'రేచుక్క'లో...

చెన్నై తీసుకురమ్మని, సినిమాలకు సిఫారసు చేస్తానని చెప్పారు. దాంతో చెన్నై వెళ్లి తేనాంపేటలో ఒక లాడ్జిలో దిగి ప్రయత్నాలు ప్రారంభించాం.

**రామారావుగారి చలువతో రాజుపేద చంద్రహారం చిత్రాల్లో నటించా**

బి.ఎ. సుబ్బారావు 'రాజుపేద' (1954), విజయావారి 'చంద్రహారం' (1954) చిత్రాల్లో నటించాం. పెద్ద ఫలితం కనిపించలేదు. పిల్లల వేషాలతో జరుగుబాటు కాకపోవడంతో మా నాన్నగారు సుబ్బారావు ప్లీడరు, డాక్టర్లు, కాంపౌండర్ లాంటి వచ్చిన చిన్న చిన్న వేషాన్ని వేస్తుండేవారు. చివరి ప్రయత్నంగా ఎన్.టి.రామారావుగారి కలవాలని వెళ్లాము. ఆయన ఇంట్లో పుండరీకాక్షయ్యగారు ఉన్నారు. ఆయన "రామారావు గారు నిద్రిస్తున్నారు. కలవడం కుదరదు" అని కరాఖండిగా చెప్పేశారు. మేము నిరాశగా వెనుదిరుగుతుంటే, అలికిడికి రామారావుగారు లేచి బాల్కనీలో నుండి మమ్మల్ని చూసి, మేడమీదికి రమ్మన్నారు. ముద్దుగా ఉన్న నన్ను, మా తమ్ముళ్లు శేషగిరి, బాలును ఒడిలోకి తీసుకుని ముద్దాడి, ఆ సమయంలో తాము నిర్మిస్తున్న 'తోడు దొంగలు' (1954) చిత్రంలో మా సోదరులకు అవకాశమిచ్చారు. టి.జి. కమలాదేవి, మద్దాలి కృష్ణమూర్తి గార్ల కొడుకులుగా నటించా. మేకప్ ఏమీ లేదు. కేవలం నల్లగా మసిపూశారు. గుడిసెలో షూటింగ్ కనుక గుడిసె పిల్లల గెటప్ అది. రామారావు గారి ఆపన్న హస్తంతో మాలో ధైర్యమొచ్చింది. మూడు రోజుల షూటింగుకు రూ.1,116 ఇచ్చారు. మళ్లీ వేషాల వేట ప్రారంభించాం. సరిగ్గా ఒక మాసం గడువు పెట్టుకున్నాం. పాత్రలు రాకపోతే పాలకొల్లు వెళ్లిపోదామనుకున్నాం. ఎక్కడికెళ్లినా నా వాయిస్ కీచుగా ఉందని, అబ్బే లాభంలేదని పెదవి విరిచేవారు.


**ఒకే రోజు మూడు సినిమాలు**

సరిగ్గా అప్పుడే బాలనటుడిగా మంచి ఫైలులో ఉన్న కందామోహన్ వాళ్ల నాన్నగారి బదిలీ వల్ల హైదరాబాద్ వెళ్లిపోయాడు. బాల నటుల కొరత ఏర్పడింది. అంచేత నాకు కాలం కలిసొచ్చింది. ఒక రోజు ఉదయం 'సాధనా' సంస్థ నుండి కబురొచ్చింది. రంగనాథదాసు దృశ్యం వివరించారు. అన్నంలో నీళ్ల

(తరువాయి 25వ పేజీలో)

## తెలంగాణా జానపదం!

# సిన్మాకంటే ఎక్కువ నచ్చే శారద కథ!



'శారద' కత జానపదాలవంటి కతే! బుర్రకథలా ఉంటుంది!

భర్త గంగారామ్, గంగమ్మ గొంతులు కలిస్తే గంగా ప్రవాహంలా కథ సాగుతుంది. నాలుగు గంటలపాటు సాగే యీ కథ వింటుంటే– కాలమే తెలియదట. ఓసారి ఓ కలెక్టర్ యీ కథను బహుళంగా ప్రశంసించాడు. వందలమంది శ్రోతలను నాలుగు గంటలకు పైగా ఆకట్టుకోగలిగిందంటే కథపై పట్టు తప్పు ఏ కనికట్టూ లేదు.

ఆదిలాబాద్ ఆలిండియా రేడియో శ్రోతలకు గంగమ్మ గొంతు సుపరిచితం. ఆదిలాబాద్ కరీనంగర్, వరంగల్ జిల్లాల్లో ఎక్కడ ఏ వేడుక జరిగినా గంగమ్మ భర్త గంగారామ్‌తో కలిసి అక్కడ వాలిపోతుంది. డముకు వేసేందుకు ఒకరు, జోకులు చెప్పి నవ్వించేందుకు మరొకరు. కథచెప్పేందుకు ఇద్దరు ఇలా నలుగురు కలిసి శ్రోతలకు నాలుగైదు గంటలపాటు ఆనందాన్ని పంచుతారు. 40 ఏళ్లుగా గంగమ్మ బృందం ఇదే కళను నమ్ముకుంది. గంగమ్మ ప్రతిభను గుర్తించి పొట్టిశ్రీరాములు విశ్వవిద్యాలయం అవార్డు ఇస్తాం హైదరాబాద్‌కు పిలిపించిది.

**కత గంగలా ఉరుకుద్ది**

"కత చాలా బావుంది గంగమ్మా.. నాలుగు గంటలపాటు కదలకుండా విన్నానంటే నమ్ము" అంటూ కలెక్టరయ్య మెచ్చుకుంటే మా గొప్పగా అనిపించింది. నాకు తెలిసిందల్లా శారదకతే. మా పెద్దోళ్లు కూడా శారదమ్మనే నమ్ముకున్నారు. నా పెనిమిటి ఇంటోళ్లు కూడా శారదగాంండ్రే. పూర్వం ఇన్ని సీన్మాలు, టీవీలు లేకుండె. కథలు, భజన్లు, ఆటలే కాలక్షేపం. మా జిల్లాలో దేవాపూర్‌లో 70 కుటుంబాలకు శారద కతే ప్రాణం. నా చెవుల్లో వినిపించేది వాటంతట అవే నాలుగు కతలు నోటికొచ్చాయి. నా పెనిమిటి కతలు చెప్పేటోడు. ఆయనతో కలిసి నేనూ కత చెప్పేదాన్ని! నేనేమీ సదువుకోలే. శారదమ్మకు మొక్కి కొబ్బరికాయ కొట్టి, తంబూరా భుజానికెత్తుకుంటే మాట గంగలా పరుగెత్తుకుంటూ వత్తాది. పండగయినా, బతుకమ్మ ఆటయినా, వేడుకయినా, గంగమ్మ కథ ఉండాల్సిందే అంటారు. మా కత బుర్రకథ మాదిరే ఉంటది. పిలుపు మాత్రం శారదకత అంటారు.

**కాసుల్తో అభిషేకం**

శారదమ్మ రూపంతో తంబూరను పట్టుకుని కత చెప్తాం గదా. మమ్మల్ని అందుకే శారదగాంండ్రనేవాళ్ళు. పూర్వం రేత్రి 8 గంటలకు కత మొదలెడితే తెల్లారేదాకా చెబుతూనే ఉండేటోళ్లం. అంతచెప్పినా 5 రూపాయలే ఇచ్చేటోళ్లు. కానీ ఆ నాటి గౌరవం వేరు. 1980కి ముందు అనుకుంటా! ఊర్లో ఎన్టీవోడి సీన్మా ఆడుతున్నాది. మేం నలుగురం కత చెబుతున్నాం. సీన్మాకంటే మా కత కాడే ఎక్కువ జనం జమయ్యారు. రేతిరంతా మా హుషారుగా కత సెప్పాం. కత బాగా నచ్చిందో ఏమో రూపాయి కాసుల్తో అభిషేకం చేశారు. ఇప్పుడు కాలం మారింది. సిన్మాలు, టీవీలు మస్తయినయ్. జనాలకి సరదా కావాలి. అందుకే మా కతల్లో జోకర్‌ను పెట్టాం. కత మధ్యలో జోకర్‌గాడు నవ్విస్తా ఉంటాడు. నాలుగు గంటలు నలుగురం కలిసి కత చెబితే ఓ అయ్య ఎయ్యి రూపాయలిస్తే మరో అయ్య ఓ అయిందు వందలు ఎక్కువిస్తారు. ఆ పైసలతోనే నలుగురు మగ బిడ్డల్ని చదివించుకున్నాం. ఉద్యోగాలు ఏయించుకున్నాం. ఆడపిల్లలకు పెళ్లిల్లు చేశాం. ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, మహారాష్ట్రాల్లో కతలు చెబుతాం. ఎక్కడ ఏం జరిగినా... గంగమ్మా కతరా అని ఫోన్ చేస్తారు. అంతే తంబూరా ఎత్తుకుని ఎల్లిపోతాం. పొలంపనులు తక్కువగా ఉండే కాలంలో కతలు బాగా దొరుకుతాయి. మిగిలిన దినాలు కూలినాలి చేసుకుంటాం అని గంగమ్మ అన్నట్లు ఓ పత్రిక వ్రాసింది. ●

*Lovely Stay at Holy Tirupathi* *The Gateway of Lord Balaji*

**HOTEL MAYURA**

204, 209, T.P. Area, Tirupati - 517 501 (A.P.)
(Opposite Bus Station)
Phone : 0877-2225925, 2225251, Fax : 0877-2225911
e-mail : mayurahotels@yahoo.co.in, Grams :

*(24వ పేజీ తరువాయి)*

పోసే సీను అది. బేబీ విజయలక్ష్మి కాంబినేషన్. ఫస్టు షాటు ఒకే అయిపోయింది. దాంతో ఎ. నాగేశ్వరరావు చిన్నప్పటి వేషానికి ఎంపికయ్యాను. అదే రోజు బోగ్‌రోడ్డులోని పి.ఎ.పి. ఆఫీసులో జనతావారి 'పరివర్తన' చిత్రంలో ఎ.ఎన్.ఆర్. తమ్ముడు శివం పాత్రకు తీసుకున్నారు. అదే రోజు ప్రతిభావారి 'రేచుక్క' చిత్రంలో ఎన్.టి.ఆర్. చిన్నప్పటి వేషానికి తీసుకున్నారు. అలా ఒకే రోజు మూడు సినిమాలకు బుక్ అయ్యాను.

**ఇప్పటికీ నాకు ఆనందాన్నిచ్చే పాట**

'సంతానం'లో లతా మంగేష్కర్ పాడిన 'నిదురపోరా తమ్ముడా..' పాట నా మీద చిత్రీకరించబడడం తలచుకుంటే ఇప్పుడూ మనసు ఆనందంతో ఉప్పొంగుతుంది. ఈ చిత్రంలోనే మా నాన్నగారు రైల్వే టి.సిగా నటించారు.




బేబీ విజయలక్ష్మి తన తమ్ముళ్లిద్దరిని తీసుకు రైలెక్కాలి. ఆ తర్వాత 30 కిపైగా తెలుగు చిత్రాలు, పది తమిళ చిత్రాల్లో నటించాను. బాలనటుడిగా నా చివరి చిత్రం 'శభాష్‌రాజా' (1961). కేసరి హైస్కూలులో చదువు కొనసాగించాను. ప్రముఖ నటీమణులు రాజశ్రీ, మణిమాల, కెమెరామేన్ కె.ఎస్. ప్రకాష్ నా సహాధ్యాయులు. నేను ఎస్.ఎస్.ఎల్సీ పాసయ్యాను. బాల నటుల విషయంలో ఇప్పటికీ, అప్పటికీ చాలా తేడా ఉంది. ఏదో ఒక వయసులో హీరో చిన్నతనాన్ని చూపి సరిపెడుతున్నారు. కాని అప్పుడలా కాదు. నాలుగు, ఆరు, ఎనిమిది, పది, పన్నెండు సంవత్సరాలు. ఇలా పద్ధతిగా హీరో పెరగడం డిజాల్వ్స్‌లో చూపేవారు. అందువల్ల ఈ వయోబేధాన్ని చూపెట్టే పాత్రలలో మా సోదరులం అందరం నటించేవాళ్లం. ఆ పరిస్థితి రాను రానూ పోయింది.

**మేనమామ కూతురితో నా వివాహం**

నాకు 1970 మార్చి 25న మా మేనమామ కూతురు మాణిక్యాంబతో వివాహం జరిగింది. నా పెళ్లయిన రెండు నెలలకే రాజసులోచనగారు హఠాత్తుగా బాంబు పేల్చారు. అదేమంటే పిల్లలు తనను ఆమెరికా వచ్చేయమంటున్నారని. 'ఇక అక్కడే స్థిరపడదామనుకుంటున్నాను. నువ్వు మరెక్కడైనా పనిచూసుకో' అన్నారు. ప్రొడక్షన్‌గా పని చేశాను.

ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటూ హాయిగా ఇంట్లో ఉంటున్నాను. నాకు ఇద్దరు అబ్బాయిలు, ఒక అమ్మాయి. అందరికీ వివాహమైంది నా పెద్ద తమ్ముడు శేషగిరి పంజాబ్ మరియు సింధ్ బ్యాంక్ మేనేజరుగా పనిచేసి రిటైరయ్యాడు. మా ఆఖరి తమ్ముడు రమణ హైద్రాబాద్‌లో 'ప్రొఫెషనల్ కొరియర్స్'లో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు.

అందరం సంతోషంగా ఉన్నాం. చిన్నపిల్లలుగా సినిమాల్లోకే వచ్చాం. ఇప్పుడు ఆ సినిమాలు చూస్తుంటే మాకే నవ్వు వస్తూ వుంటుంది. ●

జి.వి. రావ్ పేజీ
(గోటేటి వేంకటేశ్వరరావు)

# గమ్యాన్ని చేరేవరకు ప్రయత్నాన్ని విరమించకు



- స్వామి వివేకానంద

## క్రికెట్టోపఖ్యానం

అన్ని లక్షణాలతోపాటుగా నాకీ క్రికెట్టు మహా పిచ్చ సరదా దురద వుంది, అది చూస్తే అన్నిపనులు మానేస్తావురా అని నాన్నగారు మందలిస్తారు, ఇన్నాళ్ళుగా చూస్తున్నావు ఏమి నేర్చుకున్నావని మీరడగచ్చు.

ఇదిగో ఇదే నేర్చుకున్నా.

మొదటగా, క్రికెట్లో ఒకడు బ్యాటింగ్ ఆడితే ఒకడు బంతి వేస్తాడు, ఇది పద్ధతిగా వుంది, ఒకడికి ఒకడితో పోటీ, యుద్ధం. కాని మరో పదిమంది ఆ బ్యాట్ ఆడేవాడి చుట్టూర నిలబడి రన్ కొట్టకుండా అడ్డుకుంటూ, వాడిని అవుట్ అదే మైదానునుంచి తిరిగి పంపించెయ్యాలని కంకణం కట్టుకుంటారు, ఇదేవి న్యాయం? ఇవన్ని అధిగమించి వాడు ఆడితేనే వాడు గెలవగలడు.

కాని దీనినుండి గ్రహించినదేమంటే ఒకడు జీవితంలో పైకి రావాలని ప్రయత్నిస్తుంటే వాడిని వృధిలోనికి రానీయకుండా పోటీగానైతేనేమి , అసూయతోనైతేనేమి పదిమంది వాడిని అణగదొక్కడానికి ప్రయత్నిస్తారు.ఇది ఇప్పటి లోకంతీరు.కాని జీవితంలో గెలవాలనుకునేవాడు వారందరిని అధిగమించి తన లక్ష్యం వైపు పయనించాలి.

రెండవది, సరే ఒకడు ఆడుతున్నాడు ఒకడు బంతేస్తున్నాడు, పదిమంది వాడిని అడ్డుకుంటున్నారు, కాని ఈ తంతు చూడడానికి పదివేలమంది కూర్చుని వారి ఆట చూసి కేరింతలు గోల గొడవ చేస్తూంటారు. ఒక బంతి వచ్చి వేగంగా తగులుతుంది, అవుట్ అని పదివేలమంది అరుస్తారు, కాని అది అవుట్కాదని ఆడేవాడికి తెలుసు కాని అంపైయర్ చెప్పేదాకా ఆగుతాడు, అతను అవుట్ కాదన్నాక హమ్మయ్య అనుకుంటాడు.నీకు పదివేలమంది ఎదురు తిరిగినా ఒక్క సత్యం “అంపయర్” నువ్వు అవుట్కాదని చెప్పినపుడు న్యాయం నీపక్కన వున్నప్పుడు నిన్నెవరూ ఏమి చెయ్యలేరు. అలాగే వాడు ఫోర్ కొట్టినా సిక్స్ కొట్టినా ఆ పదివేలమంది అలాగే కేరింతలు కొడతారు, అవుట్ అన్నా అరుస్తారు ఫోర్ అన్నా అరుస్తారు,

దీనినుండి, ఈలోకం నువ్వు పైకెళ్ళినపుడు ఎంతగా నిన్ను మెచ్చుకుంటుందో, నువ్వు క్రిందకు జారినపుడు అంతే కేరింతలు కొడుతుంది.

నువ్వు వెళ్ళే సత్యమార్గం సరయినదైనపుడు ఎంతమంది ఎన్నిరకాలుగా అన్నా, అనుకున్నా నిర్ణయం దైవానికి వదిలి నీ మార్గంలో నువ్వు పయనించు అంతా మంచే జరుగుతుంది.అసత్యం ఎంత బలమైనదైనా సత్యం ముందు నిలబడదు.

ఇక మూడవదిగా, ఒకడు ఆడడానికి వచ్చాడు, ఒకడు బంతి వెయ్యడానికి వచ్చాడు, పదిమంది వాడిని ఆడనియ్యకుండా వచ్చారు అంతవరకూ ఓకే కాని ఈ బ్యాట్ ఆడేవాడు కూడా ఒకడిని తెచ్చుకుంటాడు, వాడొక్కడు చాలు వీడి కొంపముంచడానికి, అక్కరలేనప్పుడు ఒక పరుగు ప్రారంభించి తీరా వాడు పరుగు ప్రారంభించకా వీడు వెనక్కెళ్ళి నించుండిపోతాడు దాంతో వాడు అవుటైపోతాడు.

చూశారా, దీనిలో గమనించవలసినదేమంటే

నిన్ను పడగొట్టాలని నీ విరోధులే కాదు, నీవారు స్నేహితులవచ్చు, బంధువులవచ్చు కావలసినవారవచ్చు ప్రయత్నిస్తూనే వుంటారు కాబట్టి నువ్వు జాగరూకతతో అప్రమత్తంగా వుండాలి, అప్పుడే జీవితంలో గెలవగలవు.

ఇక ఈ మూడిటికన్నా ముఖ్యమైనదొకటుంది, అదేవిటంటే నీకు వచ్చిన ప్రతి బంతి నిన్ను అవుట్ చెయ్యాలనే, పడగొట్టాలనే వచ్చింది కాని నువ్వు చాకచక్యంగా ఆడి ఫోర్ సిక్సర్ కొట్టి చెంచరి వంద పరుగులు కొడితేనే నువ్వు వ్యక్తిగతంగా గెలిచినట్టు, జీవితంలో వచ్చే ప్రతి సమస్య నిన్ను కృంగదియ్యాలనే వస్తుంది దాన్ని నువ్వు సవాల్ గా తీసుకుని చాకచక్యంగా ఎదుర్కున్నప్పుడే నువ్వు జీవితంలో గెలవగలవు. ఇదండి క్రిక్కెట్ నేర్పిన గీత! ●

# ప్రియవ్రతుడు వంటి పాలకుడు కావాలి!

ప్రజాపాలకుడంటే నిరంతరం రాజ్యంలోని ప్రజల మేలు కోరుతూ జీవించాలని పూర్వకాలం నాటి పాలకులు భావిస్తుండేవారు. భూమినేలిన చక్రవర్తులలో పృథుచక్రవర్తి తర్వాత ప్రియవ్రతుడు అంతటి గొప్పవాడు. ఆయన స్వాయంభువ మనువు కుమారుడు. నారద మహర్షి వల్ల ఆత్మజ్ఞానం పొంది విరక్తుడై వనాలకు వెళ్లాడు. ప్రియవ్రతుడిలోని శక్తిసామర్థ్యాలను గుర్తించిన బ్రహ్మదేవుడే దిగి వచ్చి కర్తవ్యాన్ని బోధించగా గృహస్థాశ్రమం స్వీకరించి, చాలాకాలం రాజ్యాన్ని చక్కగా పాలించాడు. భగవదంశతో జన్మించిన ప్రియవ్రతుడు, ప్రజాపతి విశ్వకర్ముడు కుమార్తె అయిన బర్హిష్మతిని వివాహమాడాడు. ఆ దంపతులకు అగ్నీధ్రుడు, కవి, మేధాతిథి లాంటి పదిమంది మగ సంతానం. ఊర్జస్వతి అనే కుమార్తె గారు. ప్రియవ్రతుడి కుమారులలో ముగ్గురు చిన్నతనంలోనే జ్ఞానులై సన్యాసనం స్వీకరించి వెళ్లిపోయారు. ప్రియవ్రతుడికి మరో భార్య వల్ల ఉత్తముడు, తామసుడు, రైవతుడు అనే మరో ముగ్గురు కుమారులు కలిగారు. వారు మన్వంతర అధిపతులయ్యారు. ప్రియవ్రతుడి కుమార్తె ఊర్జస్వతి శుక్రాచార్యుడిని పెళ్లాడింది. వారికి దేవయాని అనే కుమార్తె జన్మించింది. ప్రియవ్రతుడు దైవాన్ని ఉపాసించి గొప్ప శక్తిని సంపాదించాడు. ఎన్నెన్నో సిద్ధులు అతనికి సొంతమయ్యాయి. ప్రియవ్రతుడు ఏనాడూ స్వార్థం కోసం వినియోగించుకోలేదు. భూమిని పాలిస్తూ భూమిమీద ప్రజలంతా నిరంతరం సుఖసంతోషాలతో ఉండి తీరాలన్నదే ఆయన ప్రధాన లక్ష్యం.

ఓసారి ఆయనకు ఓ ఆలోచన వచ్చింది. పగలు రాత్రి ఏర్పడుతున్నప్పుడు, రాత్రివేళల్లో ప్రజలు చీకటి బాధను అనుభవిస్తున్నారనిపించింది. దానికి కారణం సూర్యుడు మేరుపర్వతం చుట్టూ ప్రదక్షిణం చేస్తూ ఉండడం వల్ల భూమండలంలోని సగభాగం వెలుతురుగాను, తక్కిన సగభాగం చీకటిమయంగాను మారడాన్ని గమనించాడు. సూర్యప్రకాశం లేని భూభాగంలో కూడా వెలుగు వచ్చేలా చేయాలని సంకల్పించుకున్నాడు. వెంటనే కష్టతరమైన తపస్సు చేసి భగవంతుడిని ఉపాసించి సూర్యరథంతో సమానంగా ఉన్న తేజోమయమైన ఓ రథాన్ని సంపాదించుకున్నాడు. ఆ రథం మీద రెండో సూర్యునిలా ప్రకాశిస్తూ తిరిగాడు. సూర్యుడు మేరు పర్వతానికి ఉత్తరాన ఉన్నప్పుడు దక్షిణ దిక్కున, సూర్యుడు దక్షిణాన ఉన్నప్పుడు ఉత్తరాన తిరుగుతూ ఏడుసార్లు సూర్యుడిని అనుసరించి ప్రదక్షిణ చేశాడు. ప్రజలకు చీకటి లేకుండా పోయింది. ఆ సమయంలో ఆయా రథచక్రాల అంచులుతాకి భూమి మీద ఏడు గుటలు పడ్డాయి. అవే సప్తసముద్రాలయ్యాయి. ఆ సముద్రాల కారణంగా భూమి ఏడు భాగాలైంది. జంబు, ప్లక్ష, శాల్మలి, కుశ, క్రౌంచ, శాక, పుష్కర అనే ఏడు ద్వీపాలుగా మారిపోయింది. సప్త సముద్రాలు, సప్తద్వీపాలు అలా ఆయన కారణంగానే ఏర్పడ్డాయి. భరతవర్షం ఆనాడు ఏర్పడిన జంబూద్వీపంలో ఉంది.

ఆ తర్వాత ప్రియవ్రతుడు తన మొదటి భార్య సంతానంలో వైరాగ్యంతో వెళ్లిపోయిన ముగ్గురినీ మినహాయించి మిగిలిన ఏడుగురికికి సప్తద్వీపాలను అప్పగించి పరిపాలింపజేశాడు. నదులు, పర్వతాలు, అరణ్యాలు భూమి కలిసిపోయి కలగాపులగం గాకుండా ప్రతి ద్వీపంలోను భూమిని విభాగించి ఎల్లలు ఏర్పరిచాడు. పదకొండు కోట్ల సంవత్సరాల పాటు ధర్మనిష్ఠతో రాజ్యపాలన చేశాడు. ఆ తర్వాత విరాగి అయి తపస్సు చేసుకునేందుకు గంధమాదన పర్వతానికి వెళ్లి భగవంతుడిలో లీనమయ్యాడు. ప్రియవ్రతుడు ప్రజాపాలకులకు మార్గదర్శకం కావాలి. ●

# TRUE EXCELLENCE IN HOSPITALITY



## NEW DELHI

- Well Appointed 107 Rooms
- Centrally Air-conditioned
- 32" LCD TV with all popular channels
- Complimentary Breakfast
- Internet access through "Wi-Fi" -24 hrs.
- Luggage storage facility
- All Credit Cards accepted
- Currency Exchange facility
- Restaurant-2 No's serving the best South/North/Chinese cuisine
- Banquet/conference facility (Theater style 100 persons



## VIJAYAWADA

- Well Appointed Rooms
- Centrally Air-conditioned
- 32" LCD TV with all popular channels
- Complimentary Breakfast
- Internet access through "Wi-Fi" -24 hrs.
- All Credit Cards accepted
- Currency Exchange facility
- Pure Vegetarian Restaurant- serving the best South/North/Chinese cuisine
- Banquet/conference facility (Theater style 150 persons)



## JAIPUR - ★★★★

- Well Appointed Rooms
- Centrally Air-conditioned
- 32" LCD TV with all popular channels
- Complimentary Breakfast
- Internet access through "Wi-Fi" -24 hrs.
- All Credit Cards accepted
- Currency Exchange facility
- Restaurant-2 No's Multi Cuisine
- Banquet/conference facility (Theater style 200 persons)
- Board Room
- Roof Top Restaurant
- Swimming pool
- Bar
- Spa
- Gym

Complimentary : Transport from Railway Station / Airport to our Hotel, subject to prior intimation to our offices

HOTEL SOUTHERN™
*style. comfort. enjoy.*

18/2, Arya Samaj Road,
Karol Bagh, New Delhi.
Tel.: 4353 2824, 2875 4210
Fax: 011-2875 7308
e-mail: info@hotelsouthern.com

SOUTHERN GRAND HOTELS

Opp. Registrar's Office, Gandhi Nagar,
Vijayawada, Andhra Pradesh.
Tel.: 66 77 777, 66 55 777
Fax: 0866-257 2227
e-mail: bookings@hotelsoutherngrand.com

Managed by ZONE BY THE PARK HOTELS
(Owned by Southern Travels Group)

D-65 A, Madho Singh Road,
Bani Park, Jaipur - 16
Tel.: 0141 - 4231 000
Mobile : 081077 34445
e-mail: sales.jpr@zonebythepark.com

Find us on Facebook
twitter
YouTube

www.facebook.com/southerntravels
www.twitter.com/happyholidaying
www.youtube.com/southerntravels

SOUTHERN TRAVELS™
*happy holidaying...*
Since 1970
(Recognised by Ministry of Tourism, Govt. of India)
**SOUTHERN TRAVELS PVT. LTD.**

www.southerntravelsindia.com

Corporate Office: 18 / 2, Arya Samaj Road, Karol Bagh, NEW DELHI-110 005. (INDIA)
Tel.: +91-4353 2800 (100 Lines), 2875 8728, 2875 3466, 4353 2805, Cell: 93125 09789, Fax: +91-11-2875 7308, e-mail: info@southerntravels.in
Branch Offices: Bengaluru: 080 - 2226 2633, Chennai : 044 - 2538 5253, Coimbatore : 0422 - 420 0999,
Mumbai: 022 - 2501 0027, Hyderabad: 040 - 2330 3561, Warangal: 0870 - 255 5536,
Vijayawada: 0866 - 257 6624, Vizag: 0891 - 274 5565, Rajahmundry: 0883 - 242 5536, Jaipur: 0141 - 4231099

Member IATA PATA Incredible !ndia TAFI

| CALL US | 8 AM - 10 PM Customer Care | 1800 11 0606 TOLL FREE | 011 2875 0606 | SMS: SOUTHERN <requirements> to 53030 eg., SOUTHERN "TOURS" or "HOTEL" |
|---|---|---|---|---|

www.idealdesigns.in - 9849557172

Date of Publication - 3rd of every month
PRAMUKHANDHRA
February 2016

REGN. No. TN/CC(S)DN/177/15-17
Licensed to Post without Prepayment. WPP No. TN/PMG(CCR)WPP-656/15-17
Registered with Registrar of Newspapers for India RNI No. 67369/97

